



# విజయభాను




విశాఖపట్నం, గురువారం 24-09-2020 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 44 సంచిక : 14 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం జగన్





తిరుమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు. పంచెకట్టు, తిరునామంతో.. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణల మధ్య ఊరేగింపుగా వెళ్లి శ్రీవారికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వేదపండితులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం సీఎం జగన్, డిప్యూటీ సీఎంలు ఆళ్ల నాని, నారాయణ స్వామి,

తరువాయి 2లో..

## జలశక్తిశాఖ మంత్రి షెకావత్‌తో సీఎం జగన్ భేటీ



న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ పర్యటన రెండోరోజు కొనసాగుతోంది. బుధవారం ఉదయం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో సీఎం జగన్ భేటీ అయ్యారు. పోలవరం ప్రాజెక్ట్‌కు నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా షెకావత్‌కు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు నిధులు అందించాలని కోరారు. అలాగే పోలవరం ప్రాజెక్ట్ పర్యటకు రావాలని జలశక్తి మంత్రిని సీఎం జగన్ కోరగా, త్వరలోనే పోలవరం పర్యటనకు వస్తానని ఆయన హామీ ఇచ్చారు.

అలాగే గోదావరి-కావేరి నధుల అనుసంధానంపైన కూడా చర్చ జరిగింది. నదుల అనుసంధానం అంశంపై

తరువాయి 2లో..

## జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### ఏపీ ప్రెస్ అకాడెమీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి




విజయవాడ : జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏపీ ప్రెస్ అకాడెమీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి స్పష్టం చేశారు. ఆయన బుధవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. జర్నలిస్టులు ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడాలో శిక్షణ ఇస్తాం. గ్రామీణ, డెస్క్ విలేకరులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించాం. ఒక వెబ్ సైట్ కూడా ఏర్పాటు చేస్తున్నాం. జర్నలిస్టులు ఎన్నో విధాల సమస్యలు ఎదుర్కొంటున్నారు. కోవిడ్ సమయంలో కష్టపడి పని చేసినా ఫలితం లేదనే భావన ఉంది. ప్రభుత్వంతో సంప్రదింపులు

తరువాయి 2లో..

## 'పంటల బీమాపై రైతులదే తుది నిర్ణయం'



న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ మెడికల్ టెక్నాలజీ జోన్ (ఏఎంటీజెడ్)కు కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన 25 కోట్ల ఆర్థిక సహాయంలో భాగంగా ఇప్పటి వరకు 7.49 కోట్ల రూపాయలు విడుదల చేసినట్లు కెమికల్స్, ఫెర్టిలైజర్స్ శాఖ మంత్రి డీవీ సదానంద గౌడ తెలిపారు. రాజ్యసభలో బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ.. బల్క్ ఇండస్ట్రీకి కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేసే పథకం కింద విశాఖపట్నంలో మెడ్ టెక్ జోన్ ఏర్పాటుకు 25 కోట్ల సాయం అందించే అంశానికి కేంద్ర ప్రభుత్వం తుది ఆమోదం తెలిపిందని చెప్పారు. ఈ మొత్తంలో 30 శాతం నిధులను ఏఎంటీజెడ్‌కు విడుదల చేసినట్లు తెలిపారు. నాలుగేళ్ళుగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం అమలుపై రైతులు ఇతర భాగస్వామ్య పక్షాలతో జరిపిన చర్చలు, సంప్రదింపుల అనంతరం ఈ పథకాన్ని సమూలంగా మార్పులు చేయాలని నిర్ణయించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ రాజ్యసభలో విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు జవాబిస్తూ చెప్పారు. అందులో భాగంగా వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంగా 2020 ఖరీఫ్ సీజన్ నుంచి దీనిని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. పంటల బీమాపై దీర్ఘకాలికంగా రైతులు చేస్తున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ పథకంలో చేరాలా, వద్దా అని నిర్ణయించుకునే స్వేచ్ఛను రైతులకే విడిచిపెట్టినట్లు మంత్రి తెలిపారు. 2020 ఖరీఫ్ సీజన్‌లో పంటల బీమాకు సంబంధించి అందిన వివరాల ప్రకారం పంటలు బీమా చేసుకునే రైతుల సంఖ్య గత ఖరీఫ్ సీజన్ మాదిరిగానే ఉందని చెప్పారు.

## మోహినీ అవతారంలో దేవదేవుడు



తిరుమల : తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో ఐదో రోజైన బుధవారం శ్రీవారి ఆలయంలోని కల్యాణోత్సవ మండపంలో శ్రీ మలయప్పస్వామివారు మోహినీ రూపంలో సర్వాలంకార భూషితుడై దంతపు పల్లకీలో దర్శనమిచ్చారు. మరో తిరుచ్చిపై శ్రీకృష్ణుడిగా అలంకృతుడై భక్తులకు అభయమిచ్చారు. పండితుల వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకులు స్వామివారికి కర్పూర, పూర్ణకుంభ హారతులు సమర్పించారు. అనంతరం రంగనాయకుల మండపంలో ఆస్థానాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో తితిదే ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో ఏవీ ధర్మారెడ్డి తదితరులు వాహన సేవలో పాల్గొన్నారు. రాత్రి 7గంటల నుంచి 8.30 వరకు గరుడసేవ జరగనుంది. గరుడ సేవ సందర్భంగా స్వామివారికి సీఎం జగన్ సాయంత్రం పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

## ఉపాధి హామీ పథకం అమలులో లక్ష్యాలను సాధించాలి

### జిల్లా కలెక్టర్ వి.వినయ్ చంద్

విశాఖపట్నం : ఉపాధి హామీ పథకం లో చేపట్టిన భవన నిర్మాణాలు రాబోయే మార్చి నెలలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వి.వినయ్ చంద్ తెలిపారు.బుధవారం నాడు స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం అమలుపై ఎస్ ఇ లు , ఇ ఇ లతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నఈ పనులను ఎలాంటి జాప్యం లేకుండా చేయాలని తెలిపారు. మెటీరియల్ కాంపోనెంట్ ఖర్చు చేయడం, భవనాల నిర్మాణం పూర్తి చేయడం లక్ష్యాలకు అనుగుణంగా జరగాలని తెలిపారు. అంగన్ వాడీలు, రైతు భరోసా కేంద్రాలు , సచివాలయాలు , విలేజ్ హెల్త్ క్లినిక్ లు , కాంపౌండ్ వాల్స్ నిర్మాణాల పనులన్నీ తప్పని సరిగా శనివారం లోగా ప్రారంభించాలని తెలిపారు.

ఇంజనీర్లు వారికి కేటాయించిన హెడ్ క్వార్టరు లో నివాసం ఉండి పనులను పర్యవేక్షించాలని తెలిపారు. కొంత మంది ఇంజనీర్లు లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమౌతున్నారని , వారి పని తీరు మెరుగుపర్చుకోకపోతే పరిపాలనా చర్యలు తీసుకోవలసి వస్తుందని తెలిపారు.

ఇప్పటి నుంచి ప్రతిరోజు టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తానని తెలిపారు. ఈ




కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అరుణ్ బాబు, పంచాయితీరాజ్ ఎస్ ఇ సుధాకర రెడ్డి, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ ఇ రవికుమార్, ఎస్ ఎస్ ఎ పిడి మల్లికార్జునరెడ్డి, హౌసింగ్ పిడి జయరామ్ చారీ, డ్వామా పిడి సంధీప్, గిరిజన సంక్షేమ ఇ ఇ లు , ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రెడ్డిపల్లి పద్మనాభం రోడ్డు విస్తరణకు రూ.10 కోట్లు మంజూరు

### రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు వెల్లడి

విశాఖపట్నం : రెడ్డిపల్లి - పద్మనాభం రోడ్డు విస్తరణ పనులకు ప్రభుత్వం 10 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు బుధవారం వెల్లడించారు. రెడ్డిపల్లి-పద్మనాభం రోడ్డు సుమారు 3.50 కి.మీ. విస్తరణకుగాను న్యూ డెవలప్ మెంట్ బ్యాంకు (ఎన్.డి.బి.) సహకారంతో పనులు చేపట్టుటకుగాను ప్రభుత్వం జి.ఓ.ఆర్.టి. నం.303, తే 22.11.2019 ది, టి.ఆర్ అండ్ బి శాఖ ద్వారా రూ.10.04 కోట్లు (అక్షరాల పది కోట్లు నాలుగు లక్షల రూపాయలు మాత్రమే) మంజూరు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఆ ప్రాంత

తరువాయి 2లో..



## న్యాయవాదికి హైకోర్టు ఆదేశాలు

అమరావతి : అమరావతి భూ కుంభకోణంలో మాజీ అడ్వకేట్ జనరల్‌పై ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హైకోర్టు ఇచ్చిన గ్యాగ్ ఆర్డర్‌ను సవాలు చేస్తూ అడ్వకేట్ మమత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను బుధవారం విచారించిన హైకోర్టు ధర్మాసనం, కౌంటర్ దాఖలు చేయాలని మాజీ అడ్వకేట్ జనరల్‌తరపు న్యాయవాదికి ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. కాగా, రాజధాని అమరావతి కోర్ క్యాపిటల్ ఏరియాలో మాజీ అడ్వకేట్ జనరల్, సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి కుమార్తెలు, మిగిలిన నిందితులు కలిసి జరిపిన భూముల కొనుగోళ్ల వెనుక భారీ కుంభకోణం ఉందంటూ ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన విషయం విదితమే. అయితే ఈ కేసులో ఎవ్వరినీ అరెస్టుచెయ్యొద్దని.. అలాగే, ఈ కేసుకు సంబంధించి ఎలాంటి వార్తలు ప్రచురణ, ప్రసారం చేయరాదంటూ పత్రికలను, టీవీలను, సోషల్ మీడియాను నియంత్రిస్తూ ఈ నెల 15న హైకోర్టు ఉత్వర్వులు జారీ చేసింది.




# సజావుగా సచివాలయ పరీక్షలు

**జిల్లా కలెక్టర్ జె.నివాస్**



శ్రీకాకుళం : గ్రామ/వార్డు సచివాలయ పరీక్షలు సజావుగా జరిగాయని జిల్లా కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. బుధవారం, ఉదయం, గ్రామ వ్యవసాయ సహాయకులు (గ్రేడ్-2) (విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ) పోస్టునకు పరీక్షలు జరిగాయి.

జిల్లాలో అయిదు కేంద్రాలలో ఈ పరీక్షలు నిర్వహించడం జరిగిందని, కేశవరెడ్డి ఇంగ్లీష్ మీడియం స్కూల్, గీతాంజలి స్కూల్, భాష్యం హై స్కూల్, చైతన్య హై స్కూల్, ఎం.వి.ఎస్. డిగ్రీ కాలేజీలలో ఈ పరీక్షలు జరిగాయని చెప్పారు.

మొత్తం 702 మంది అభ్యర్ధులకు గాను 508 మంది అభ్యర్ధులు హాజరైనారని, 194 మంది అభ్యర్ధులు గైర్హాజరైనారని 72 శాతం అభ్యర్ధులు హాజరైనట్లు తెలిపారు. కరోనా పాజిటిన్ పేషెంట్లు ఎవ్వరూ హాజరు కాలేదని చెప్పారు.

## ఎడ్యుకేషన్ అండ్ డాటా ప్రోసెసింగ్ సెక్రటరీ పరీక్షలకు 62 శాతం హాజరు

శ్రీకాకుళం : వార్డు ఎడ్యుకేషన్ అండ్ డాటా ప్రోసెసింగ్ సెక్రటరీ ప్రవేశ పరీక్షలకు 62 శాతం మంది అభ్యర్ధులు హాజరైనట్లు జిల్లా కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం జిల్లాలో ఎడ్యుకేషన్ అండ్ డాటా ప్రోసెసింగ్ సెక్రటరీ పరీక్షలు అయిదు కేంద్రాలలో జరిగాయని తెలిపారు. మొత్తం 793 మంది అభ్యర్ధులకు గాను 491 మంది అభ్యర్ధులు హాజరు కాగా 302 మంది గైర్హాజరైనారు. కరోనా పాజిటివ్ పేషెంట్లు ఎవ్వరూ ఈ పరీక్షలకు హాజరు కాలేదని తెలిపారు.

## తగ్గిన బంగారం, వెండి ధరలు

దిల్లీ: బంగారం, వెండి ధరలు మళ్లీ తగ్గాయి. 10 గ్రాముల మేలిమి బంగారం ధర దిల్లీలో బుధవారం రూ.614 తగ్గి రూ.50,750కు చేరింది. గత సెషన్‌లో బంగారం 10 గ్రాముల ధర 51,364గా ఉంది. ఇక వెండి ధర కూడా కేజీకి రూ.1,898 తగ్గి రూ.59,720కు చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు తగ్గుముఖం పట్టడంతో దేశీయంగానూ పసిడి ధరలు దిగి వస్తున్నాయని మార్కెట్ నిపుణులు అంటున్నారు.

అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రస్తుతం ఔన్సు బంగారం ధర 1874 డాలర్లు ఉండగా.. వెండి ఔన్సు ధర 23.26 డాలర్లు ఉంది. డాలరు విలువ క్రమంగా బలపడుతుండడం, ఇన్నాళ్లు సురక్షిత సాధనంగా భావించిన బంగారం నుంచి పెట్టుబడులు తరలడం వంటివి ధరల తగ్గుముఖం పట్టడానికి కారణమని చెప్పారు. కరోనా కారణంగా చాలా మంది తమ పెట్టుబడులను బంగారం వైపు మళ్లించడంతో ఇటీవల బంగారం ధరలకు రెక్కలొచ్చిన సంగతి తెలిసిందే.

**మొదటి పేజీ తరువాయి**

# శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం జగన్



ధర్మాన కృష్ణ దాస్, మంత్రులు పెద్దిరెడ్డి రాంచంద్రారెడ్డి, మేకతోటి సుచరిత, కొడాలి నాని, మేకపాటి గౌతమ్ రెడ్డి, వెల్లంపల్లి శ్రీనివాస్, చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ, చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు భూమన కరుణాకర్ రెడ్డి, చింతల రామ చంద్రారెడ్డి, బియ్యపు మధు సూధన్ రెడ్డి, కొలుసు పార్థ సారధి, ఏపీఐఐసీ చైర్మన్ ఆర్.కె.రోజా శ్రీవారి గరుడ వాహన సేవలో పాల్గొన్నారు. కాసేపటి క్రితమే సీఎం బేడి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**పద్మావతి అతిథి గృహానికి సీఎం**

తిరుమల తిరుపతి దేవస్థానం క్యాలెండర్‌ను, డైరీని ఆయన ఆవిష్కరించిన సీఎం జగన్.. శ్రీవారి దర్శనం అనంతరం శ్రీ పద్మావతి అతిధి గృహానికి చేరుకున్నారు. ఈ రాత్రికి ఆయన అక్కడే బస చేస్తారు. గురువారం ఉదయం 6.15 గంటలకు పద్మావతి అతిధి గృహం నుండి బయలుదేరి.. కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి యడ్యూరప్పతో కలిసి శ్రీవారిని దర్శించుకుంటారు. ఇరు రాష్ట్రాలు ముఖ్యమంత్రులు నాద నీరాజనం సుందర కాండ పారాయణ కార్య క్రమంలో పాల్గొంటారు. అలాగే కర్ణాటక రాష్ట్ర ఛారిటీస్ సత్రాలకు శంఖుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం తిరుమల నుండి 9.20 గంటలకు బయలుదేరి 10.20 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని గన్నవరం తిరుగు ప్రయాణం అవుతారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగం పై అనుసరిస్తున్న విధానాలను ప్రతిఘటించండి




గాజువాక: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగం పై అనుసరిస్తున్న విధానాలను ప్రతిఘటించండి అని స్టీల్ అఖిలపక్ష కార్మికులు నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ప్రధాన పరిపాలనా భవనం ఎదుట అఖిలభారత కార్మిక సంఘాల పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు. దీనిలో పెద్ద ఎత్తున కార్మికవర్గం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా స్టీల్ గుర్తింపు యూనియన్ అధ్యక్షులు జె. అయోధ్య రామ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఒక్క స్టీల్ ప్లాంటే పన్నులు, డివిడెంట్ల రూపంలో ఇప్పటి వరకు 42 వేల కోట్ల చెల్లించాయని ఆయన అన్నారు. అలాగే దేశవ్యాప్తంగా ఉన్న 243 ప్రభుత్వరంగ సంస్థలు చెల్లించిన సొమ్ముతోనే ప్రభుత్వ ఖజానాకు భారీగా నిధులు జమ అవుతున్నాయని ఆయన వివరించారు. వెనకటికి ఒకడు" తను కూర్చున్న కొమ్మని తానే నరికిన" చందంగా ప్రభుత్వ విధానాల ఉన్నాయని ఆయన ఎద్దేవా చేశారు. నేడు రైతుసంక్షేమం పేరుతో తెచ్చిన బిల్లులు ద్వారా రైతులు తమ భూముల్లోనే బానిసలగా మారుతారని ఆయన వివరించారు. అలాగే పెట్రోలియమ్ కంపెనీలైన హెచ్పిసియల్, బిపిసి ఎల్ లను అమ్మడం ద్వారా నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో ప్రజల జీవనం అస్తవ్యస్తంగా మారుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్ ఇంటక్ అధ్యక్షులు గంధం వెంకట్రావు, ఏఐటీయూసీ జాతీయ నాయకుడు డి. ఆదినారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ప్రభుత్వరంగ పరిశ్రమలు ఆధునిక దేవాలయాలని గౌరవిస్తే, నేటి ప్రభుత్వాలు అవి చావడానికే ఉన్నాయి ఈ రోజు కాకుంటే మరుసటి రోజు అన్న వాదనను ముందుకు తేవడం అత్యంత దుర్మార్గమని వారు తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను విడకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో స్టీల్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి వై. టి. దాస్, సిఐటియు నగర నాయకులు యన్. రామారావు, స్టీల్ అఖిలపక్ష నాయకులు బి. అప్పారావు, యమ్. రామచంద్రరావు, సంపూర్ణం, జి బోసుబాబు, వై. మస్తనప్ప, దొమ్మేటి అప్పారావు, డి. వి రమణారెడ్డి,టి. సత్యనారాయణ, సిహెచ్. సన్యాసిరావు, టి. జగదీష్, మౌలేశ్వరావు, జె. రామకృష్ణ, వి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగానికి హానిచేసే వ్యవసాయ బిల్లులపై

# సెప్టెంబర్ 25 న జరిగే నిరసనకు సీపీఎం మద్దతు

విశాఖపట్నం : రైతాంగానికి, వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం కలిగించే వ్యవసాయ బిల్లులను పార్లమెంటులో బిజెపి అప్రజాస్వామికంగా ఆమోదింపజేసుకోవడాన్ని సిపిఎం విశాఖ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుంది. అలాగే ఈ బిల్లులపై ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలుపుతున్న 8 మంది రాజ్యసభ సభ్యులను సస్పెండ్ చేయడాన్ని దుర్మార్గమైన చర్య. పార్లమెంటరీ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను తుంగలో తొక్కి బిల్లులు ఆమోదింపజేసుకోవడం బిజెపి నిరంకుశత్వానికి నిదర్శనం.

మూడు వ్యవసాయ చట్టాలు దేశ వ్యవసాయ రంగాన్ని రైతులను నాశనం చేస్తాయి. వ్యవసాయ రంగాన్ని అగ్రి బిజినెస్ కార్పొరేట్లకు ధారాదత్తం చేసేందుకే ఇవి ఉపయోగపడతాయి. రైతులకు కనీస మద్దతుధర రద్దవుతుంది. ఆహార అక్రమ నిల్వలు భారీగా పెరిగి కృత్రిమ ఆహార కొరత, ధరల అనూహ్య పెరుగుదలకు దారితీస్తుంది. ఫలితంగా ప్రజల ఆహార భద్రతను ప్రమాదంలోకి నెడుతుంది. తెలంగాణ టిఆర్ఎస్ తో సహా వివిధ పార్టీలు లోక్‌సభ, రాజ్యసభలోని ఈ బిల్లులను వ్యతిరేకించినా మన రాష్ట్రానికి చెందిన అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి ఈ బిల్లులను సమర్థించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఇలా సమర్థించడం రైతాంగానికి నష్టం కలిగించే బిజెపి చర్యలకు వంతపాడటమే. మూడు వ్యవసాయ బిల్లులకు వ్యతిరేకంగా దేశవ్యాపితంగా ఈనెల 25న 200లకు పైగా రైతు సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసన కార్యక్రమాలకు వామపక్ష పార్టీలు పూర్తి మద్దతునిస్తున్నాయి. ఈ పిలుపును జిల్లాలో జయప్రదం చేయాల్సిందిగా ప్రజలకు, కార్యకర్తలకు సిపిఎం విశాఖ జిల్లా కమిటీ విజ్ఞప్తి చేస్తోంది.

# అప్పుడు లేని డిక్లరేషన్ ఇప్పుడు ఎందుకు?



అమరావతి: తిరుమలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి డిక్లరేషన్ విషయంలో విపక్షాలు చేస్తున్న ఆరోపణలపై తెలుగు అకాడమీ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ నేత నందమూరి లక్ష్మీ పార్వతి విరుచుకుపడ్డారు. ప్రతి ప్రతిపక్ష పార్టీలో ఉన్న వాళ్ళంతా ఖాళీగా ఉంటూ ప్రభుత్వంపై అర్థం లేని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. డిక్లరేషన్ పేరుతో అనవసరంగా ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీద బురద చల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరోనా నేపథ్యంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు విపక్షాలకు పట్టడం లేదని విమర్శించిన లక్ష్మీ పార్వతి.. మతం పేరుతో ప్రజలని రెచ్చగొట్టాలని చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ కల్చర్‌లో ఎటువంటి హింసాత్మక ఘటనలకు పాల్పడ్డారో అలాగే ఇప్పుడు మతం పేరుతో రెచ్చగొడుతున్నారన్నారు. చంద్రబాబు కాంగ్రెస్ నుండి వచ్చారు కాబట్టి కాంగ్రెస్ సంప్రదాయాలను ఇంకా మర్చిపోలేదని ఎద్దేవా చేశారు. బీజేపీ, టీడీపీ నేతలు రాష్ట్రంలో అలజడి సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని లక్ష్మీపార్వతి ఆరోపించారు. టీడీపీ నేతలు మాట్లాడినట్లే బీజేపీ నాయకులు మూర?ంగా మాట్లాడుతున్నారని, హిందూ సంప్రదాయం చంద్రబాబు ఎప్పుడు పాటించారో చెప్పాలని డిమాండ్ చేశారు. హిందూ మతం పట్ల చంద్రబాబు నమ్మకం ఉంటే ప్రజలకు నిరూపించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రికి డిక్లరేషన్ గురించి మాట్లాడే వారు సోనియా గాంధీ తిరుమల వచ్చినప్పుడు డిక్లరేషన్ అడిగారా అని ప్రశ్నించారు. కాషాయం వేసిన మూరు?లు అంతా ఒక చోట చేరారని,, హిందూ అనేది ఒక మతం కాదని, హిందూ అనేది ఒక ధర్మం అన్నారు. మతం పేరు చెప్పి విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. 'లోకేష్‌ను ముఖ్యమంత్రిని చెయ్యడం కోసం భువనేశ్వరి క్షుద్ర పూజలు చేసింది. అమ్మవారి దేవాలయంలో అర్ధరాత్రి క్షుద్ర పూజలు చేయించిన దుర్మార్గురాలు చంద్రబాబు భార్య. బీజేపీకి అస్సలు చిత్తశుద్ధి ఉంటే గతం సంవత్సరంలో కూడా జగన్ పట్టు వస్త్రాలు సమర్పించారు. అప్పుడు లేని డిక్లరేషన్ ఇప్పుడు ఎందుకు ప్రస్తావిస్తారు. భువనేశ్వరి, లోకేష్ కోసం చేసిన క్షుద్ర పూజల గురించి బీజేపీ నేతలు అడగాలి. ముఖ్యమంత్రికి రాష్ట్రంపై సర్వ హక్కులు ఉంటాయి. రాజు విష్ణువుతో సమానమని పురాణాలు చెప్తున్నాయి. రాజుకు మతాలు అంటగట్టడం దారుణం. బీజేపీ, టీడీపీ నేతలు డిక్లరేషన్ గురించి వాస్తవాలు మాట్లాడాలి. జగన్ ఎప్పుడో హిందువుగా మారారు. గతంలో స్వరూపానంద జగన్‌మోహన్‌రెడ్డిని తీసుకొని గంగా నదిలో పూజలు చేయించారు. గంగా నదిలో మూడు మునకలు మునిగి హిందువుగా మారారు. అలా అని క్రిస్టియానీటిని పక్కన పెట్టినట్లు కాదు. కొందరు స్వామీజీలు కాషాయం ధరించి రాజకీయాలు చేస్తున్నారు. ముస్లింగా ఉన్న కరీం దాసు, బిబి నాంచారి ఎవరో స్వామిజీలకు తెలీదా. మతం పేరుతో ప్రజలలో హింసను రెచ్చగొట్టి మధ్య యుగంలోకి నెడతారా. కుహనా హిందువులను హెచ్చరిస్తున్నా అవాస్తవాలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. సమాజానికి కావాల్సింది విద్యా, వైద్యం కానీ మతం, కులం కాదు. ఇప్పటికైనా రాజకీయ పక్షాలు అభివృద్ధి, సంక్షేమం కోసం పని చేయాలి. డిక్లరేషన్ పై బహిరంగ చర్చకు ఎవరితో అయిన నేను సిద్ధం. హిందూ సంప్రదాయం, పురాణాలపై నాకు పూర్తి అవగాహన ఉంది. నేను ఖురాన్, బైబిల్, భగవద్గీతను నేను చదివాను. సర్వమతాలను నేను ఆరాధిస్తాను' అని లక్ష్మీ పార్వతి అన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

చేస్తున్నాం.. త్వరలో మంచి జరుగుతుంది. సీఎం వైఎస్ జగన్ సానుకూలంగా ఉన్నారు.

శిక్షణ కోసం అనేక ప్లాట్ ఫామ్స్‌పై ఆధారపడాల్సి వస్తోంది. అన్ని శాఖలను ఒక చోట చేర్చి సమాచారం అందించేలా చర్యలు చేపడుతున్నాం. కోవిడ్ సమయంలో మీటింగులు పెట్టే అవకాశం లేదు. అందుకే ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇవ్వాలని నిర్ణయించాం. తొలుత విశాఖ నుంచి ప్రారంభిస్తున్నాం. ఎలక్ట్రానిక్ మీడియా శిక్షణపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రెస్ అకాడెమీ కృషి చేస్తుంది. వారి శిక్షణ కోసం యూనివర్సిటీలతో ఒప్పందాలు కుదుర్చుకోనున్నాం. జర్నలిస్టులందరూ ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి. ఫేక్ న్యూస్ నిమిషాల్లో సోషల్ మీడియా ద్వారా ప్రచారం జరుగుతోంది. అటువంటి వార్తల పట్ల ఎలా అప్రమత్తత ఉండాలో కూడా శిక్షణలో భాగంగా ఉంటుంది. సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు వెళ్లేలా కూడా బాధ్యత తీసుకుంటున్నాం. వర్కింగ్ జర్నలిస్టులు జర్నలిజంలో ఏదయినా కోర్స్ చేయాలి అనుకుంటే ప్రెస్ అకాడమీ సహకరిస్తుంది. ప్రతి జర్నలిస్ట్ వెనుక ప్రెస్ అకాడెమీ ఉంటుందని గుర్తుంచుకోండి' అని దేవిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి పేర్కొన్నారు.

# జలశక్తిశాఖమంత్రి షెకావత్‌తో సీఎం జగన్ భేటీ

రాష్ట్ర పర్యటనకు వెళ్లాలని టాస్క్‌ఫోర్స్ చైర్మన్ వేదిరే శ్రీరామ్‌కు జలశక్తి మంత్రి షెకావత్ సూచించారు. సీఎం జగన్ వెంట వైఎస్సార్ సీపీ ఎంపీలు విజయసాయి రెడ్డి, మిథున్ రెడ్డి కూడా ఉన్నారు. కాగా 2021 డిసెంబర్ కల్లా పోలవరం ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావిస్తోంది. కాగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో సీఎం వైఎస్ జగన్ మంగళవారం సాయంత్రం హోం మంత్రి నివాసంలో భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని నిబంధనల ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రం నుంచి అందాల్సిన సాయంపై చర్చించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. వీటితోపాటు దిశ చట్టం, శాసన మండలి రద్దు.. చట్ట రూపు దాల్చే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరినట్లు ఆ వర్గాలు తెలిపాయి.

### రెడ్డిపల్లి పద్మనాభం రోడ్డు విస్తరణకు రూ.10 కోట్లు మంజూరు

ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి రోడ్డు విస్తరణ పనులకు 10 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని కోరగా తక్షణమే ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి రూ.10 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వు లను జారీ చేసినట్లు మంత్రి వివరించారు.

# మెడ్ టెక్ జోన్‌కు 7.49 కోట్లు విడుదల

**రాజ్యసభలో వి.విజయసాయి రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబు**

న్యూఢిల్లీ : విశాఖపట్నంలోని ఆంధ్రప్రదేశ్ మెడికల్ టెక్నాలజీ జోన్ (ఏఎంటీజెడ్)కు కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన 25 కోట్ల ఆర్థిక సహాయంలో భాగంగా ఇప్పటి వరకు 7.49 కోట్ల రూపాయలు విడుదల చేసినట్లు కెమికల్స్, ఫెర్టిలైజర్స్ శాఖ మంత్రి శ్రీ డి.వి. సదానంద గౌడ తెలిపారు. రాజ్యసభలో బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు శ్రీ వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ బల్క్ ఇండస్ట్రీకి కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేసే పథకం కింద విశాఖపట్నంలో మెడ్ టెక్ జోన్ ఏర్పాటుకు 25 కోట్ల సాయం అందించే అంశానికి కేంద్ర ప్రభుత్వం తుది ఆమోదం తెలిపిందని చెప్పారు. ఈ మొత్తంలో 30 శాతం నిధులను ఏఎంటీజెడ్‌కు విడుదల చేసినట్లు తెలిపారు. పంటల బీమాపై రైతులదే తుది నిర్ణయం నాలుగేళ్ళుగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం అమలుపై రైతులు ఇతర భాగస్వామ్య పక్షాలతో జరిపిన చర్చలు, సంప్రదింపుల అనంతరం ఈ పథకాన్ని సమూలంగా మార్పులు చేయాలని నిర్ణయించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ నరేంద్ర సింగ్ తోమర్ రాజ్యసభలో శ్రీ విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు జవాబిస్తూ చెప్పారు.

అందులో భాగంగా వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంగా 2020 ఖరీఫ్ సీజన్ నుంచి దీనిని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. పంటల బీమాపై దీర్ఘకాలికంగా రైతులు చేస్తున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ పథకంలో చేరాలా, వద్దా అని నిర్ణయించుకునే స్వేచ్ఛను రైతులకే విడిచిపెట్టినట్లు మంత్రి తెలిపారు. 2020 ఖరీఫ్ సీజన్‌లో పంటల బీమాకు సంబంధించి అందిన వివరాల ప్రకారం పంటలు బీమా చేసుకునే రైతుల సంఖ్య గత ఖరీఫ్ సీజన్ మాదిరిగానే ఉందని చెప్పారు.

# భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎదురుకాల్పులు

**ముగ్గురు మావోయిస్టులు మృతి**

చర్ల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల పరిధిలోని చెన్నాపురం అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. పోలీసులు- మావోయిస్టుల కాల్పులు మధ్య జరిగాయి. ఈ ఘటనలో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందినట్లు జిల్లా ఎస్పీ సునీల్‌దత్ ప్రకటించారు. ఘటనాస్థలంలో పరిశీలించగా మావోయిస్టుల మృతదేహాలు లభ్యమైనట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో 8 ఎంఎం రైఫిల్, బ్లాస్టింగ్‌కు ఉపయోగించే సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

మరికొంతమంది మావోయిస్టులు తప్పించుకున్నారనే సమాచారంతో భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

# రక్తదానానికి ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ముందుకు రావాలి



గాజువాక : అపోహలను వీడి ప్రతీ ఒక్కరు రక్తం దానానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం గాజువాక వైఎస్ఆర్ సీపీ పార్టీ కార్యాలయంలో 72వ వార్డు వైఎస్సార్సీపీ కార్పొరేటర్ అభ్యర్థి శ్రీ సిరట్ల శ్రీనివాస్ ( వాసు) జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి,మాజీ శాసనసభ్యులు చింతల పూడి వెంకట్రామయ్య గాజువాక వైఎస్సార్సీపీ ఇన్చార్జ్ తిప్పల దేవన్ రెడ్డిలు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భారీ కేక్ ను కట్ చేసి వాసుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ళ జీవించాలని, రాజకీయాలలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని భగవంతుడు ఆయనకు శక్తిని ప్రసాదించాలని కోరారు. రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

# హిందు సాంప్రదాయాన్ని గౌరవించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

ములగాడ : రాష్ట్ర ప్రభుత్వం హిందువుల మనోభావాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నదని ఇది మంచి పోకడ కాదని హిందు సాంప్రదాయాలను గౌరవించాలని 61వార్డ్ తెదేపా అధ్యక్షుడు మజ్జి సోమేష్ పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి కొడాలి నాని హిందువుల మనోభావాలను దెబ్బతిన్న విదంగా వ్యహరించిన తీరుపై తెదేపా అధిష్ఠానం పిలుపు మేరకు వార్డ్ తెదేపా శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టారు. బుధవారం మల్కాపురం మరిడిమాంబ ఆలయం వద్ద టీడీపీ వార్డ్ అధ్యక్షులు మజ్జి సోమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు కార్యకర్తలు నిరసనలను వ్యక్తం చేశారు. హిందు సాంప్రదాయం గౌరవించాలి, మన దేవాలయాలను కాపాడాలి మన దేముళ్ల విగ్రహాలు ఆస్తులు కాపాడాలి దాడులను అరికట్టాలని ప్రభుత్వం పై ధ్వజమెత్తారు. ఇదే కొనసాగితే హిందువుల ఆగ్రహానికి మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. తెదేపా ఆదేశాల మేరకు, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు సూచనలతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు కాకి పాలిరెడ్డి, వార్డ్ తెదేపా కార్పొరేటర్ అభ్యర్థి సర్వసిద్ది శ్రీలక్ష్మి, ఆర్మీ శ్రీను, ఉరుకుటి పైడి రాజు, బొట్ట చిన్న తదితరులు పాల్గొన్నారు.

## పలు పంచాయితీలలో నిధుల మళ్ళింపుపై విచారణ




ఎస్.రాయవరం : ఎస్.రాయవరం మండలంలోని పలు గ్రామాలలో పంచాయితీ నిధులు మళ్ళింపు జరిగినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు డిఎల్పీవో శిరీషారాణి తెలిపారు. బుధవారం ఉదయం మండల కేంద్రమైన రాయవరం పంచాయితీ కార్యాలయంలో మండల ఈవోపీఆర్డీ త్రిమూర్తులపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఐదు పంచాయితీల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ... గొలుగొండ మండలం ఏ.ఎల్.పురం గ్రామానికి చెందిన ఎస్.వెంకటరమణ అను వ్యక్తి రాయవరం ఈవోపీఆర్డీగా పని చేస్తున్న త్రిమూర్తులు ప్రత్యేకాధికారిగా వున్న ఐదు గ్రామాలకు చెందిన నిధులను తన కుమారుడు బ్యాంకు అకౌంట్ కు తరలించినట్లు ఫిర్యాదు చేశాడన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు ఆయన ప్రత్యేకాధికారిగా వున్న కొరుప్రోలు, పెదవుప్పలం, గెడ్డపాలెం, కొత్త రేవుపోలవరం, గుడివాడ గ్రామపంచాయితీలలో అభివృద్ధి పనులకై ఖర్చు చేసిన వివరాల పరిశీలన చేస్తున్నామన్నారు. కొరుప్రోలు పంచాయితీ నుండే సుమారు యాభైవేల రూపాయలు నిధులు మళ్ళింపు జరిగాయని ఫిర్యాదులో పేర్కొనగా, సుమారు పది లక్షల రూపాయలు వరకు ఐదు పంచాయితీల నుండి నిధులు మళ్ళింపు జరిగి వుంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. రికార్డుల పరిశీలన అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

# వైఎస్ఆర్ ఈఎఫ్ లో పలువురి చేరిక



విశాఖపట్నం : ప్రజా రవాణా శాఖకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న తిరుకి ఆకర్షతులై పలు సంఘాలు నుండి వై.ఎస్.ఆర్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ లోకి పలువురు చేరారు. వైస్సార్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ విజయనగరం జోన్ పర్యటన లో బాగంగా విజయనగరం డిపోతో పాటు నగరంలో పలు డిపోల్లో రాష్ట్ర కమిటీ సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు ఆర్. దేవరాజులు, జి.శ్రీనివాసరావులు మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వం లో విలీనం చేసి, గతంలో ఎవ్వరూ చేయని సాహసోపేత నిర్ణయం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి తీసుకున్నారని అందుకు కమిటీ తరుపున ముఖ్యమంత్రి కి, ప్రభుత్వనికి కృతజ్ఞతలు తెలిపారు. కోవిద్ 19 సమయంలో కూడా సిబ్బందికి అన్నీ విధాలుగా సహాయ సహకారాలు అందించారని తెలిపారు. ప్రధాన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అయిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఎ. పి.జి.ఈ.ఎ) అనుబంధంగా ఉన్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలు డిపోల్లో నుండి సభ్యత్వం తీసుకొన్నారు. నేషనల్ మాజ్దూర్ యూనియన్ నుండి సేనాపతి వెంకటేశ్, డి.ఆర్.బాబు తో పాటు పలువురు వై.ఎస్.ఆర్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ లో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు వి.జయరావు, ఉపాధ్యక్షులు ఎ.వి.వి.సత్య నారాయణ, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి జి.పి.రావు, కోశాధికారి పూర్ణచంద్రరావు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత వేగంగా కలవర్టు నిర్మాణం

## జోడుగుల్లు ప్రాంతవాసులు ఆనందం



సబ్బవరం : మండల కేంద్రంలో మేజర్ పంచాయతీలో భాగమైన జోడుగుల్లు ప్రాంత ములో 7 లక్షల నిధులు జివిఎంసి నిధులతో రైవాడ కాలువ పై కల్వర్టుని నిర్మాణం జరిగింది. ప్రస్తుత పెందుర్తి ఎమ్మెల్యే అధీప్‌రాజ్ ఎన్నికల ముందు పెందుర్తి శాసన సభ్యునిగా గెలుపొందితే రైవాడ కాలువ పై కల్వవర్టు నిర్మాణానికి కృషి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. వైసీపీ పార్టీ గెలు పొందిన సంవత్సరం తరువాత రైవాడ కాలువ పై కల్వర్టు నిర్మాణానికి జివియంసి అధికారులతో మాట్లాడి 7 లక్షల నిధులతో నిర్మాణానికి పూనుకున్నారు. ఆయన చొరవతో కల్వర్టు నిర్మాణం అత్యంత వేగంగా జరిగింది. ఈ ప్రాంతవాసులు ఆనందంగా వున్నారు. గతంలో కాలువ రోడ్డు ఇరుకుగా ఉండ డంతో అనేక ప్రమాదాలు జరిగాయి. జోడుగుల్లు నుండి నరవ మీదుగా వైజాగ్ గాజువాక ప్రాంతాలకు ఈ మార్గం ఉపయోగంగా ఉంది అందుచే ప్రయనికులంతా ఈ మార్గాన్ని ఎంచుకున్నారు . జోడుగుల్లు ప్రాంతం ఇరుకుగా ఉన్నా సరే వాహనాలు కూడా భారీ వాహనాలతో రద్దీగా ఉంటుంది. కాలువ పై కల్వరు నిర్మాణంతో కొంత ఉపశమనం కలిగింది.

## రాష్ట్ర మంత్రి అవంతి శ్రీనివాస్‌రావు చొరవతో సంగివలస కాలనీలో

# త్రాగు నీరు సమస్య పరిష్కారం

భీమునిపట్నం : జీవిఎంసి భీమిలి జోన్ 2వ వార్డు కార్పొరేటర్ వైసీపీ నాయకురాలు సరళారాణి కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి అవంతి శ్రీనివాస్ రావు చొరవ తో సంగివలస కాలనీ లో త్రాగు నీరు సమస్య పరిష్కారం. చేశారు. గురువారం బోర్ వేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు పీతల వెంకటప్పారావు, సీనియర్ నాయకులు చిల్ల భాస్కర్ రెడ్డి, ప్రసాద్, మహిళ నాయకులు పద్మ,దేవి, వాసుపిల్లి నరేంద్ర, వార్డు వాలెంటేర్స్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఈనెల 29న మన్యం బంద్

పాడేరు : జీవో నెం.3కి చట్టబద్ధత కల్పించేందఱుకు ఈనెల 28 నాటికి కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేయాలని, లేనిపక్షంలో 29న ఆంధ్ర, తెలంగాణాల్లో మన్యం బంద్ నిర్వహిస్తామని జీవో నెం.3 సాధన కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహఖ అధ్యక్షుడు అప్పల నరసయ్య పేర్కొన్నారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాంతికుమారి, లక్ష్మీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ఖండేపల్లిలో రక్షిత మంచినీటి పథకం ప్రారంభించిన

## ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ



వీధి కులాయి వద్ద స్థానిక మహిళలు తో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

**- ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు**

చోడవరం : మండలంలోని ఖండే పల్లి గ్రామంలో 36 లక్షల రూపాయలతో నిర్మాణం చేపట్టిన 60000 లీటర్ల సామర్థ్యం గల రక్షిత మంచినీటి పథకాన్ని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఎమ్మెల్యేకు వైసిపి నాయకులు గ్రామస్తులు, పార్టీ అభిమానులు ఘన స్వాగతం పలికారు. కోలా టాలు, తప్పుడు గుళ్ళు తో, పూలు చల్లుతూ ఊరే గింపుగా వచ్చి ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు.

అనంతరం జరిగిన బహిరంగ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంట కాలువ పనులు, సి సి రోడ్డు, నిర్మాణ పనులు ఇతర మౌలిక సదు పాయాలు కల్పించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ సత్యారావు, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడువాక సత్యారావు, వైసిపి పార్టీ సీనియర్ నాయకులు శరగడం సిమ్మి నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు పల్లా నర్సింగ్ రావు, శ్రీకాంత్, శరగడం నాగేశ్వరరావు, ఎం సోమినాయుడు, అధిక సంఖ్యలో మహిళలు వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



రక్షిత మంచినీటి పథకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

# కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



అచ్యుతాపురం : కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసే విధంగా 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్ లుగా మార్చి పెట్టుబడిదారులకు లాభం చేకూర్చే విధంగా పార్లమెంటులో బిల్లు తీసుకొచ్చిందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యుత్ ,రైల్వే రక్షణ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రవేటు పెట్టుబడిదారులకు కట్టబెట్టేందుకు చర్యలు తీసుకోవడం వలన ఉపాధి కొరకు ప్రజలు అనేక ఇబ్బందులు పడతారన్నారు. ఆశ, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కనీస వేతనం అమలుచేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగలి రాము, కర్రి అప్పారావు, మండల కార్యదర్శి కూండ్రపు సోమునాయుడు, చేపల తాతయ్య, ఆశ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ సంస్థలకు అనుగుణంగా కార్మిక చట్టాలు

ములగాడ : కార్పొరేట్ సంస్థలకు అనుగుణంగా కార్మిక చట్టాలను మార్పు చేసి, కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని కార్మిక సంఘం నాయకులు (ఇంటక్) భోగవిల్లి నాగభూషణం కార్మికులకు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జాతీయ స్థాయి కార్మిక సంఘాలు ఐ ఎన్ టి యూసీ, సి ఐ టి యు, ఏ ఐ టి యు సి, హెచ్ ఎం ఎస్ తదితర పది కార్మిక సంఘాలు ఐక్యతతో దేశవ్యాప్తంగా బుధవారం చేపట్టిన నిరసన కార్యక్రమాలలో భాగంగా ఐఎన్‌టి యూసి , సి ఐ టియు ప్రధాన కార్యదర్శులు భోగవిల్లి నాగభూషణం ,జగ్గు నాయుడు సారథ్యంలో హెచ్పి పి సి ఎల్ మెయిన్ గేట్ వద్ద కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు మొదటిగాఎన్నో పోరాటాలు చేసి సాధించకున్న 44 కార్మిక చట్టాలను తొలగించి, వాటి స్థానంలో కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగంగా లేబర్ చట్టాలను మారుస్తున్నారని కేంద్ర ప్రభుత్వం పై మండి పడ్డారు. ప్రస్తుతం రోజుకి 8 గంటల పనిదినాలస్థానములో 12 గంటలకు మార్చా లని, చట్టాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కరోనా పేరుతో కార్మిక చట్టాలను సస్పెండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వము ఆదేశాలు చేయడం దారుణమని మండిపడ్డారు. రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను కార్పొరేట్ సంస్థలు దోచుకునేందుకు 3 ఆర్డినెన్సును రాజ్యసభలో మూజువాణి ఓటుతో ఆమోదింపబడిందని, లాభాలు ఆర్జిస్తున్న ఎల్ఐసి, రైల్వే, బొగ్గు, ఇస్రో, గ్యాసు, పెట్రోల్ మొదలగు 33 ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో అమ్మకానికి అంతర్జాతీయ విఫణిలో పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రజా కార్మిక విధానాలను వ్యతిరేకించి పోరాటాలు చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని దీనికి కార్మికులందరూ ఐక్య పోరాటాలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



# విజయభాను సంపాదకీయం

## కరోనా సంక్షోభ సమయాన్ని సానుకూలంగా మార్చుకోవాలి

కరోనా సంక్షోభ సమయాన్ని సానుకూలంగా మార్చుకోవాలని చెప్పిన ప్రధాని మోదీ. ఈ కష్టకాలాన్ని ప్రజావ్యతిరేక చట్టాల రూపకల్పనకు అవకాశంగా చేసుకున్నట్లు కనబడుతున్నది. వ్యవసాయరంగ సంస్కరణల పేరిట రైతాంగ వ్యతిరేక బిల్లులు మూడు తెచ్చిన మోదీ ప్రభుత్వం, 'విద్యుత్ సవరణ బిల్లు- 2003' పేరిట మరో వినాశకర చట్టాన్ని తేవటానికి సమాయత్తమవుతున్నది. ఈ బిల్లే చట్టరూపం ధరిస్తే విద్యుత్తు ఉత్పాదన, సరఫరా, రాయితీలవం టివన్నీ కేంద్రం చేతుల్లోకి వెళతాయి. మరో అర్థంలో చెప్పాలంటే విద్యుత్తు వ్యవస్థ అంతా ప్రైవేటుపరం అవుతుంది. విధాన నిర్ణయాధికారమేదీ రాష్ట్రాల చేతుల్లో ఉండదు. వినియోగదారుడైన ప్రతి రైతూ కరెంట్ మోటర్‌కు మీటర్‌ను బిగించుకొని రీడింగ్ ప్రకారం బిల్లులు చెల్లించాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న క్రాస్ సబ్సిడీలు, ఉచిత కరెంట్ లాంటివన్నీ చట్టవ్యతిరేకమైపోతాయి. ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తూ తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసింది. సమాఖ్య స్ఫూర్తికి తూట్లు పొడిచే బిల్లును వ్యతిరేకించాల్సిందిగా బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలకు పిలుపునిచ్చింది.

మోదీ ప్రభుత్వం మొదటినుంచీ రైతులపై కత్తిగట్టినట్లే వ్యవహరిస్తున్నది. వ్యవసాయాధారిత సమాజంలో రైతుల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసి, సబ్సిడీ పథకాలు తేవడానికి బదులు కోతలు వాతలు పెడుతున్నది. దీనిలో భాగంగానే మూడు రైతు వ్యతిరేక బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టింది. పంటలకు గిట్టుబాటు ధరలుబీ ప్రైవేటు పెట్టుబడులు సమకూర్చుకోవటం, తగిన సాంకేతికతను ప్రోదిచేసుకోవటంబీ పంట విక్రయానికి స్వేచ్ఛామార్కెట్ విధానం ఎంతో మేలు చేస్తుందని మోదీ ప్రభుత్వం ఈ బిల్లుల సందర్భంగా చెప్పుకొచ్చింది. కేంద్రం మాటలన్నీ అబద్ధాలకు అందమైన వేషమేసినట్లుగా ఉన్నాయి తప్ప మరొకటి కాదు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తూ, రైతులకు దన్నుగా ఉన్న రైతు వ్యవసాయ మార్కెట్ విధానానికి తూట్లు పొడిచి స్వేచ్ఛామార్కెట్ పేర రైతు ప్రయోజనాలను కార్పొరేట్ శక్తులకు తాకట్టుపెడుతున్నది.

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచీ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేయటమే పనిగా పెట్టుకున్నది. దశాబ్దాలుగా ఎన్నో ఆటుపోట్లు తట్టుకొని లాభాల బాటలో నడుస్తూ ప్రజలకు సేవలందిస్తున్న ఎల్ఐసీ, రైల్వేలు, వైమానిక రంగాల్లోకి ప్రైవేట్‌ను ఆహ్వానిస్తున్నది. చివరికి ఆత్మనిర్భర్ పేరుతో రక్షణ రంగ ఉత్పత్తులను సైతం ప్రైవేటుకు అప్పజెప్పుతున్నది. మొత్తంగా కేంద్ర ప్రభుత్వ విధానాలన్నీ కాకులను కొట్టి గద్దలకు వేసినట్లుగా ప్రజల ప్రయోజనాలను బలిపెడుతున్నవే. ఈ నేపథ్యంలో రైతాంగ సంక్షేమం కోసం కేంద్రంపై రాష్ట్రాలు ఉమ్మడి పోరుకు సమాయత్తం కావలసిన తరుణం ఆసన్నమైనది. ఇందుకు తెలంగాణతో విపక్ష రాష్ట్ర ప్రభుత్వాలన్నీ చేయి చేయి కలుపాలి. సమాఖ్యస్ఫూర్తికి సమాధి కడుతున్న మోదీ సర్కార్‌ను నిలదీయాలి.

## సచివాలయ పరీక్షలకు నాలుగవ రోజు 74శాతం హాజరు



విశాఖపట్నం : సచివాలయాల్లో నియామకాలకు బుధవారం రాత పరీక్షలకు 74 శాతం అభ్యర్థులు హాజరయ్యారు. ఈరోజు పరీక్షలకు 5883 మంది హాజరు కావలసి వుండగా 3477 మంది హాజరుకాగా, 1304 మంది హాజరు కాలేదు. ఉదయం పరీక్షలకు 1186 మందికి 936 మంది (79 శాతం) హాజరవగా 250 మంది హాజరు కాలేదు. మధ్యాహ్నం పరీక్షలకు 3697 మందికి 2541 మంది (69శాతం) హాజరవగా 1,154 మంది హాజరు కాలేదు. పరీక్షకు హాజరైన అభ్యర్థులలో కోవిడ్ వచ్చిన వారు ఎవరు లేరు. స్క్రైబ్ లో ఉదయం ముగ్గురు, మధ్యాహ్నం ఇద్దరు పరీక్షలు వ్రాసారు.

## ఆంజనేయ నిన్ను బొమ్మ అన్న వారికి మంచి బుద్ధిని ప్రసాదించు



మద్దిలపాలెం: హిందూ దేవుళ్లను, ఆచారాలను చెక్కల తోనూ బొమ్మలతో నూ పోలికలు చేసిన రాష్ట్ర మంత్రులకు మంచి బుద్ధిని ప్రసాదించాలని విశాఖ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆంజనేయ స్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఇసుక తోట లో ఉన్న ఆంజనేయస్వామి గుడి వద్దకు తూర్పు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తో పాటు నియోజకవర్గ ముఖ్యనాయకులు హాజరై కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ హిందూ సంప్రదాయాలను మరిచి అన్యమతస్తులకు ప్రోత్సహించే విధంగా రాష్ట్ర మంత్రులు వ్యాఖ్యలు చేయడాన్ని తప్పుబట్టారు.

## ప్రయాణికుడిని బెదిరించి డబ్బులు గుంజిన గుర్తు తెలియని వ్యక్తులు




విశాఖపట్నం : ఆటో లో ప్రయాణిస్తున్న వ్యక్తిని బెదిరించి డబ్బులు గుంజిన ఘటన ఎయిర్ పోర్ట్ జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుదవారం ఉదయం చోటుచేసుకుంది. ఘటన కు సంబందించి వివరాలు ఇలాఉన్నాయి . తూర్పు గోదావరి జిల్లాకు చెందిన సూర్యప్రకాష్ ( 38 ) గాజువాకలో నివాసముంటున్న తన సోదరుని ఇంటికి వెళ్లేందుకు బుదవారం ఉదయం ఎన్ .ఏడీ కూడలి వద్ద కాలిగా ఉన్న ఆటో ఎక్కాడు . అదేసమయంలో మరో నలుగురు వ్యక్తులు ఆటో లో ఎక్కారు . ఈక్రమంలో వీరు ప్రయాణిస్తున్న ఆటో కాకాని నగర్ వద్దకి వచ్చేసరికి ఆటో లో ఉన్న నలుగురు వ్యక్తులు సూర్యప్రకాష్ ను బెదిరించి అతడి వద్ద నున్న నాలుగు వేల ఎనిమిది వందల నగదును తీసుకొని అక్కడినుండి పరారయ్యాడు . దింతో బాదితుడు సూర్యప్రకాష్ ఎయిర్ పోర్టు జోన్ క్రైమ్ పోలీసు లకు పిర్యాదు చేసాడు.

## వాసుపల్లి రాకతో దక్షిణంలో మరింత బలం

**- వాసుపల్లి గణేష్ కుమార్ కు శుభాకాంక్షలు తెలుపుతున్న సనపల రవీంద్ర భరత్**



ద్వారకానగర్ : విశాఖ దక్షిణ నియోజక వర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ని దక్షిణ నియోజక వర్గం వాణిజ్య విభాగం అధ్యక్షులు సనపల రవీంద్ర భరత్ కలిసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నదుకు శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా రవీంద్ర భరత్ మాట్లాడుతూ గణేష్ కుమార్ రాకతో దక్షిణ నియోజక వర్గంతో పాటు విశాఖపట్నం లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరింత బలపడేందుకు అవకాశం ఏర్పడు తుందన్నారు.

తద్వారా వచ్చే గ్రేటర్ ఎన్నికల్లో వైసీపీ గెలుపు ఖాయం అన్నారు. రెండు సార్లు ఎమ్మెల్యే గా గెలుపొంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండడం వలన ప్రజలలో మంచి పేరు సంపాదించారు అని అన్నారు. ఆయన్ని కలిసిన వాళ్ళలో స్టేట్ బీసీ సెల్ సెక్రటరీ బేవరా మహేష్, 38వ వార్డు ప్రచార కమిటీ పట్నాల సతీశ్, చెన్న ఈశ్వరరావు, తదితరులు ఉన్నారు.

## కవి సమయం

### నకిలీ ప్రేమ

యువత అంతా ప్రేమ అనే దీపం చుట్టూ
మిణుగురు పురుగుల వలే భ్రమణం
కని పెంచిన తల్లిదండ్రులను సైతం మోసం చేస్తూ
విద్య,విజ్ఞానాలను పంచే సరస్వతి ఆలయాలను
ప్రేమ కార్యాల పేరిట అపవిత్రం చెయ్యడం ఎంత ఘోరం ?
వీరిది ప్రేమ కాదు , ఇన్ ఫాచ్యుయేషన్ మాత్రమే
అశాశ్వతమైన శారీరక అందాల ఆకర్షణలో పడి
అదే ప్రేమనే భ్రమలో బ్రతుకుతూ
విలువైన కాలాన్ని, శక్తినీ వృధా చేసుకుంటూ
కలల ప్రపంచంలో బ్రతకడం బాధాకరం
విలువైన నిజాన్ని తెలుసుకున్న నాటికి
స్వప్న సౌధం కూలిపోయి భవిష్యత్తు
అంధకార బంధురమై అంతా అగమ్యగోచరం గా అనిపించును
అప్పటికే చేజారిపోయిన జీవితాన్ని చూసుకుంటూ
దు:ఖించడం తప్ప చేయగలిగిందేమియూ లేదు.

కవిత రచన :
సి.ప్రతాప్


## పంచాంగం

మాసం : భాద్రపద ; తిథి: అష్టమి రా.11.44; మూల రా.11.36; ఉ.వ.8.11ల 9.44; రా.వ.10.04ల 11.36.

గురువారం 24-09-2020

**మేషం** : ప్రియతముల రాకపోకలు పెరుగుతాయి. ముఖ్యులలో ఒకరికి వీడ్కోలు పలుకుతారు. మీ సంతానం ఆరోగ్యంలో, విద్యా విషయాల గురించి ఆలోచిస్తారు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడుట మంచిది. ప్రయాణాలలో చికాకులు తప్పవు. కార్మికులకు అధిక శ్రమ, చికాకు, త్రిప్పట తప్పదు. కొన్ని వార్తలు మీకు ఆందోళన కలిగిస్తాయి. **వృషభం** :నూతన వ్యాపారాలు కొనసాగిస్తారు. చేపట్టిన పనులను నిర్విఘ్నంగా పూర్తి చేస్తారు. ఇతర దేశాలు వెళ్లేందుకు చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. బంధుమిత్రులలో గుర్తింపు, రాణింపు లభిస్తుంది. స్పెక్యులేషన్ చేసే వారికి మెలకువ అవసరం. సినిమా రంగాల్లోని వారికి సంతృప్తి కానవస్తుంది. పాత సమస్యలు పరిష్కార మార్గంలో నడుస్తాయి. **మిథునం** : మిమ్మల్ని చూసి ఈర్ష్య పడేవారు అధికంగా ఉన్నారని గమనించండి. హోటల్, తినుబండారాల వ్యాపార రంగాలలోని వారికి అనుకూలమైన రోజు కాదు. సంఘంలో గుర్తింపు, రాణింపు లభిస్తుంది. వ్యవసాయ, తోటల రంగాలలోని వారికి కలసివచ్చును. అధికారులతో సంభాషించేటప్పుడు మెలకువ వహించండి. నిర్మాణ పథకాలలో జయం చేకూరును. **కర్కాటకం** :గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. స్త్రీలకు మూలక సమస్యలు తలెత్తవచ్చు, జాగ్రత్త వహించండి. పూర్వపు పరిచయ వ్యక్తుల కలయిక సంతృప్తినిస్తుంది. దైవ దర్శనం చేసుకొంటారు. సంఘంలో మీ స్థాయి పెరుగును. కళాకారులకు గుర్తింపు లభిస్తుంది. గత స్మృతులు జ్ఞప్తికి వస్తాయి. ఇంజనీరింగ్, వైద్య రంగాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. **సింహం** : ఉద్యోగస్తులకు పురోభివృద్ధి కానవచ్చినా.. కొంతమంది మాటతీరు, కొన్ని వార్తలు మీకు ఆందోళన కలిగిస్తాయి. రాజకీయాలలోని వారికి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త వహించండి. నిర్మాణ పథకాలలో జయం చేకూరుతుంది. భాగస్వామి వైఖరి ఆవేదన కలిగిస్తుంది. కుటుంబీకుల మధ్య కొత్త కొత్త విషయాలు చర్చకు వస్తాయి. **కన్య** : సాహిత్య సదస్సులలోను, బృంద కార్యక్రమాల్లోనూ పాల్గొంటారు. మీ చుట్టుప్రక్కల వారిలో మంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. సిమెంటు, ఇసుక, ఇటుక, తాపీ పనివారికి అభివృద్ధి. ఊహించని ఖర్చులు మీ అంచనాలు దాటినా మిత్రుల సహాయ సహకారాల వల్ల సమసిపోతాయి. నిరుద్యోగులు ఉద్యోగానికై చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. **తుల** : కుటుంబ సభ్యుల మధ్య అనురాగ వాత్సల్యాలు పెంపొందుతాయి. ఆర్థిక విషయాలలో చురుకుదనం కానవస్తుంది. ప్రైవేటు సంస్థలలోని వారు, సహకార సంఘాలలోని వారు పనిలో ఏకాగ్రత వహించలేక పోవడంవల్ల అధికారులతో మాటపడాల్సి వస్తుంది. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తిగా సాగుతాయి. అన్ని రంగాలలోని స్త్రీలకు చాలా యోగప్రదంగా ఉండగలదు. **వృశ్చికం** : బంధువుల రాకతో గృహంలో సందడి కానవస్తుంది. ఇచ్చిపుచ్చుకునే వ్యవహారంలో మెలకువ వహించండి. ఇతరుల ఆంతరంగిక విషయాలలో జోక్యం చేసుకోకండి. శత్రువులపై విజయం సాధిస్తారు. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తికరంగా సాగుతాయి. తల, మెడ, నడుము, నరాలకు సంబంధించిన చికాకులు ఎదుర్కోక తప్పదు. **ధనుస్సు** : క్రీడలపట్ల ఆసక్తి పెరుగుతుంది. విదేశాలు వెళ్లేందుకు చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. స్టాకిస్టులకు, బ్రోకర్లకు, ఏజెంట్లకు అనుకూలం. పారిశ్రామిక రంగంలోని వారికి సంబంధ బాంధవ్యాలు పెరుగుతాయి. బిల్లులు చెల్లించగలుగుతారు. ప్రయత్నాలలో ఒకరి వైఖరి ఆందోళన కలిగిస్తుంది. పూర్వ పరిచయ వ్యక్తుల కలయిక సంతృప్తినిస్తుంది. **మకరం** :నూతన పెట్టుబడలకు అనుకూలమైన కాలం. స్టేషనరీ రంగాలలో వారికి నిరుత్సాహం, క్రయ విక్రయదార్లకు యోగప్రదంగా ఉండగలదు. బంగారు, వెండి, లోహ, రత్న వ్యాపారస్తులకు అనుకూలమైన కాలం. మీ వ్యక్తిగత విషయాలు బయటికి తెలియకుండా గోప్యంగా ఉంచండి. ప్రచురణ, పత్రికా రంగంలోని వారికి మందకొడిగా ఉండగలదు. **కుంభం** :మీ ఆంతరంగిక సమస్య లకు పరిష్కారమార్గం కానవస్తుంది. ఆర్థిక విషయాలలో ఒక అడుగు ముందుకు వేస్తారు. విద్యా, సాంస్కృతిక విషయాలపట్ల ఆసక్తి పెరుగుతుంది. భాగస్వాములు ఆసక్తికరమైన విషయాలను చర్చిస్తారు. ఐరన్, ఆల్కహాల్ వ్యాపారస్తులకు మిశ్రమ ఫలితం. వస్త్ర వ్యాపారస్తులకు గుర్తింపు, రాణింపు లభిస్తుంది. **మీనం** :ప్రియతములలో ఒకరికి వీడ్కోలు పలుకుతారు. వాహన చోదకులకు ప్రమాదం జరిగేందుకు ఆస్కారం ఉంది, జాగ్రత్త వహించండి. కాంట్రాక్టర్లకు నూతన ఒప్పందాలు అనుకూలిస్తాయి. పండ్ల, పూల, కూర వ్యాపారస్తులకు మిశ్రమ ఫలితం కానవస్తుంది. కళంకారీ రంగాలలోని వారికి అభిమాన బృందాలు పెరుగుతాయి. నిరుద్యోగులు స్థిరపడే రోజు.

# బాబాను దర్శించిన యోగులు



శ్రీ కాక భుశుండి అవధూత

భగవాన్ బాబా పదకొండు మంది సాధకులను ఎంపిక చేసి, వారికి ప్రత్యేకమైన ఆశీస్సులతో పాటు, వారికి నిత్యము ఆహారం సమకూర్చే ఒక అక్షయపాత్రను ప్రసాదించి, హిమాలయాలలో బదరీనాథ్‌కు 25 మైళ్ళ దూరంలో వాయవ్యదిశలో నరనారాయణ పర్వతం మీద ఊర్వశీకుండ్ సమీపంలో ఒక నివాసయోగ్యమైన గుహలో తాపస జీవితం గడపమని పంపారు. భగవాన్ బాబా అప్పుడప్పుడు ఆ గుహ ఆశ్రమంలో ప్రత్యక్షమై వారికి సాధనలో వచ్చిన సంశయాలను నివృత్తి చేస్తూ ఉన్నారు. సుమారు ఐదువందలు లేక వేయి సంవత్సరాల ఆయుష్షు కలిగిన మహా సిద్ధపురుషులు అప్పుడప్పుడు ఈ నరనారాయణ గుహాశ్రమానికి వచ్చి వారితో బాబా గురించి సంభాషించి, అక్షయపాత్రలో బాబా సృష్టించిన ప్రసాదం స్వీకరించి వెళుతుండేవారు. అటువంటి సిద్ధపురుషులలో 1. కాక భుశుండి అవధూత 2. మరొక వేదాంత పరివ్రాజక సిద్ధ పురుషుడు 3. మహావతారబాబా 4. బాబా సుందరదాస్ 5. దేవరియా బాబా 6. భృగుబాబా వంటి వారు కొందరు భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి దివ్యత్వం గుర్తించిన మహానుభావులు. కాక భుశుండి అవధూత అనేది వీరి పేరు కాదు. ఈ సిద్ధ పురుషుడు హిమాలయాలలో కాక భుశుండి పర్వతం మీద నివసిస్తున్నారని నరనారాయణ గుహలోని మన ఆశ్రమవాసులు వారిని అలా భావన చేశారు. వీరు మొదటిసారి నరనారాయణ గుహకు వచ్చినప్పుడు ఆశ్రమవాసులు 'అయ్యా! శివావతారమైన శ్రీ సత్యసాయినాథ భగవానుని గురించి మీ అభిప్రాయం తెలుసుకొనవచ్చునా?' అని అడిగారు. అప్పుడు ఆయన భగవద్గీత విభూతియోగంలోని

నమో విదుః సురగణాః ప్రభవం న మహర్షయః!
అహమాదిర్హి దేవానాం మహర్షీణాం చ సర్వశః!

అనే శ్లోకం చెప్పి కృష్ణుడు అర్జునునితో 'అర్జునా! నా అవతార రహస్యమును దేవతలు ఎఱగరు. ఋషులూ ఎఱగరు. కారణమేమంటే దేవతలు మరియు మహర్షులకు నేను కారణభూతుడను. ఆదికర్తను!' అన్నాడు. ఇలా చెప్తూ ఆ అవధూత 'దివ్యస్థితి కలిగి, మంత్ర సాక్షాత్కారము చేసుకునే మహర్షులు కూడా అవతారతత్వాన్ని గుర్తించలేనప్పుడు నావంటి సాధారణమైన వ్యక్తి వారిని ఎలా తెలుసుకోగలగుతాడు?" అని పలికారు. మరికొన్ని రోజులు గడిచాక ఒకసారి బాబావారి గురించి సంభాషణ వచ్చినప్పుడు కాక భుశుండి అవధూత 'అవతారమూర్తియైన భగవంతుని దర్శనం చేసుకొని వారి అనుగ్రహాన్ని పొందుతున్న మీరు అత్యంత అదృష్టవంతులు. కాని అవతారమూర్తి మమ్మల్ని దగ్గరకు రానీయటంలేదు. ఇటువంటి స్థితిలో వారి ఆశీర్వాదం లభించటం మాకు అసాధ్యంగా ఉంది' అన్నారు.

ఈ సిద్ధపురుషుని మాటలనుబట్టి వీరు సాయినాథుణ్ణి అవతార మూర్తిగా స్వీకరించారని, వారి అనుగ్రహం కోసం తపన చెందు

## సంకీర్తన

తున్నారని స్పష్టమవుతున్నది.

శ్రీ వేదాంత పరివ్రాజక సిద్ధపురుషుడు

ఈ మహాపురుషుని పేరు అడిగే సాహసం ఆశ్రమవాసులెవ్వరూ చేయలేదు. ఈ మహనీయుడు నరనారాయణ గుహకు వచ్చి ఆధ్యాత్మిక సంభాషణ చేస్తున్నప్పుడు బాబా పంపిన ఆశ్రమవాసులు వారితో మెల్లగా తాము సత్యసాయిబాబావారూ పంపగా వచ్చిన సాధకులమని, ఆ విశేషాలు వివరించి చెప్పినప్పుడు ఆ సిద్ధ పురుషుడు వారితో 'అవును, శివుడు సత్యసాయిబాబా రూపంలో అవతారం దాల్చాడు! కాని ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఆయన మావంటి సిద్ధపురుషుల్ని దగ్గరకు రానీయటంలేదు' అన్నారు.ఈ మహనీయుని మాటల్లో కూడా వారు బాబాను పరమశివుని అవతారంగా అంగీ కరించినట్లు స్పష్టంగా తెలుస్తున్నది.

... సశేషం



బాజ్జి

## మైలవవరం ఓసీ సంఘం మహిళా అధ్యక్షురాలిగా శ్రీలక్ష్మి



మైలవరం : ఓసీ సంఘం లోని మహిళా విభాగం అయిన క్రిష్ణా జిల్లా, మైలవరం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలిగా గొల్లపూడి మండలం, రామరాజ్య నగర్ కి చెందిన మండేలా శ్రీలక్ష్మి ని నియమించినట్లు శ్రీలక్ష్మి విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నన్ను ఈ పదవిలో నియమించిన ఓసి సంగం వ్యవస్థాపక అధ్యక్షుడు కందనూరు వెంకట సుబ్బా రెడ్డి కి ప్రత్యేక కృత జ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో చాలా మంది ఓసి వాళ్ళు కడుబీదరికంతో దుర్భర దారిద్ర్యన్ని అనుభ విస్తున్నారని వారిని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని రాష్ట్ర ప్రభు త్వాన్ని ఆమె డిమాండ్ చేసింది.

## 'పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు' పై అవగాహనా కార్యక్రమం



విశాఖపట్నం : పోషణ మాసోత్సవాలలో భాగంగా మద్దిలపాలెం సెక్టార్‌లో గల కెఆర్‌ఎం కాలనీ-1 అంగన్‌వాడీ కేంద్రంలో అర్బన్-2 సీడీపీవో ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ ఆర్.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఏడబ్ల్యూడబ్ల్యూ ఆర్.సుబ్బలక్ష్మి 'కిచెన్ గార్డెన్'ను అందరం తయారుచేయాలని, 'పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు' అని తల్లులకు అవగాహన కల్పించడం జరిగింది. అందరం ఎవరికి వారుగా కిచెన్ గార్డెన్‌ను తయారుచేసి ఆరోగ్యంగా ఉండాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ హెల్పర్ పి.నాగమణి, ఎంఎస్‌కె సిహెచ్.అలేఖ్య, వాలంటీర్ పి.నాగలక్ష్మి, తల్లులు, గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు.

## 30 నిమిషంలో కొత్త రైస్ కార్డు జారీ



అన్నవరం. : బియ్యం కార్డులకు అర్హులైన వారికి వెంటనే బియ్యం కార్డు మంజూరు చేయాలన్న ముఖ్యమంత్రి వారి ఆదేశాలు మేరకు ప్రత్తిపాడు శాసన సభ్యులు పర్వత పూర్ణ చంద్ర ప్రసాద్ ఆదేశాలు మేరకు ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం తహశీల్దారు పర్యవేక్షణలో కేవలం 30 నిమిషాలలో బియ్యం కార్డు మంజూరు చేయడం జరిగింది అన్నవరం సచివాలయం 3 లో క్రొత్త రేషన్ కార్డు కోసం మంజూరు చేసుకున్న పేరు మళ్ళ.నర్సమ్మ భర్త వెంకట మంగారావు కు క్రొత్త రేషన్ కార్డు కొరకు దరఖాస్తు చేసుకొన్న అర్ధ గంట లోనే కార్డును మంజూరు చేయడంతో హర్షం వ్యక్తం చేసారు.ఈ కార్యక్రమంలో అన్నవరం పంచాయతీ ఈవో రామ్ శ్రీనివాస్, సచివాలయం 3 కార్యదర్శి రాయి.నాగు,విఆర్వో రాజశేఖర్, అచ్యుతం తదితరులు పాల్గొన్నారు.

## యువకులు బీజేపీలో చేరిక



భీమునిపట్నం : విశాఖ బీజేపీ నగర కార్యాలయంలో బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర సమక్షంలో బీజేపీ 1వ వార్డు నాయకులు అయినాడ మాధవ, సంకురుభుక్త దుర్గాప్రసాద్, బీజేపీ 1 వ వార్డు కోఆర్డినేటర్ కంటుభుక్త రామానాయుడు, బీజేపీ సీనియర్ నాయకులు ఉప్పాడ అప్పారావు, బీజేపీ విశాఖ నగర కార్యదర్శి వాసుపల్లి శ్రీహరి ఆధ్వర్యంలో ప్రధాని మోదీ అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై జీవీఎంసీ 1వ వార్డు నుంచి 20 మంది యువ నాయకులు బీజేపీ లో చేరారు. చేరిన వారిలో కాకర రమేష్, తమ్మిన ఉమాదేవి, కొల్లి అన్వేష్ కుమార్, జామిశెట్టి కృష్ణ, గొట్టిముక్కల సాయినాధ్, అయినాడ హరనాధరావ్ లు ఉన్నారు.

ఈ సందర్భంగా మేడపాటి రవీంద్ర మాట్లాడుతూ మోదీ చేపడుతున్న పథకాలను వార్డులలో అందరికీ వివరించాలని చెప్పారు.

### రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి మరియు భీమిలి శాసన సభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాస రావు(అవంతి) చొరవ తో

## దాకమర్రి ప్రాధమిక ఉన్నత పాఠశాలలో మౌలిక సదుపాయాలు



భీమునిపట్నం : భీమునిపట్నం మండలం, దాకమర్రి గ్రామ పంచాయితీ లోఎన్నో ఏళ్లుగా ప్రాధమిక ఉన్నత పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేవని మరియు పాఠశాల విద్యార్థులు చదువుకునేందుకు 5 వ తగరతి వరకే విద్యా తరగతి చదువులు ఉన్నాయని, మిగతా పై చదువులు అన్ని పక్క జిల్లా వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి వస్తుందని, కాబట్టి దాకమర్రి పంచాయితీలోనే ఉన్నత తరగతులు వాటిని పెంపొందించాలనే ఆలోచనతో గత ప్రభుత్వంలో టీడీపీ విద్య శాఖ మంత్రి అయినటువంటి గంట శ్రీనివాస రావుకి దాకమర్రి ప్రజలు ఎన్నో లేఖలు రాసి ఎంత తిరిగిన ఎటువంటి ఫలితం లేకపోయింది, కానీ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి మరియు భీమిలి శాసన సభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాస రావు(అవంతి) ప్రతి ఒక్క పేదవాడు చదువుకోవాలనే ఒక గొప్ప ఆలోచనతో దాకమర్రి గ్రామ పంచాయితీ లో పాఠశాల తరగతులు 5 వ తరగతి నుంచి 8 వ తరగతి వరకు పెంపొందించేలా చేశారు. అలాగే పాఠశాలకు మౌలిక సదుపాయాలు మరియు ప్రహారి గోడ నిర్మాణం మంజూరు చేశారు.

దీనిపై దాకమర్రి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.అలాగే మంత్రి అవంతి శ్రీనివాసరావు కి చెల్లూరి పైడప్పడు దాకమర్రి ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు.

## కార్మిక చట్టాలు, సంక్షేమ బోర్డు రద్దుకు వ్యతిరేకంగా సిఐటియు ధర్నా




పెద్దాపురం : కార్మిక చట్టాలను రద్దు చేస్తున్న కేంద్రప్రభుత్వ విదానాలకు నిరసనగా, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు రద్దుకు వ్యతిరేకిస్తూ సిఐటియు పెద్దాపురం మండల కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట దర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిఐటియు మండల కార్యదర్శి దాడి బేబి, ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు చింతల సత్యనారాయణ లు ప్రసంగించారు. దేశవ్యాప్తంగా బుధవారం అన్ని మండల కేంద్రాల్లోనూ ధర్నాలు నిర్వహించాలని అఖిల భారత కమిటీలు పిలుపునిచ్చాయి. కార్మిక చట్టాలను 4 కోడ్ లు గా మార్చేసి కార్మికుల పనిగంటలపైనా, కార్మికుల చట్టాలపైనా దాడి చేస్తున్నారని అన్నారు. ఎనిమిది గంటలు ఉన్న పని గంటలను 12 గంటలకు మార్చేస్తున్నారని, కార్పోరేట్లకు యాజమాన్యాలకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. వలస కార్మికులు, కరోనా నేపద్యంలో పని చేసిన డాక్టర్లు ప్రమాదానికి గురైతే వారి డేటా కేంద్రం దగ్గర లేదనడం దుర్మార్గమని అన్నారు. కనీస బాద్యత లేకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల 450 కోట్లు నిధులు పక్కదారి పట్టించారని అన్నారు. ఇప్పుడు ఏకంగా సంక్షేమ బోర్డునే రద్దు చేయాలని చూడడం అత్యంత ప్రమాదమని అన్నారు. పెట్రోల్ డీజిల్ ధరల పెంపుదల, సిమ్మెంట్, ఐరన్ రేట్లు పెంపుదల, ఇసుక అందుబాటులో లేకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. భవన నిర్మాణ కార్మికులు 25 వ తేదీన ఎమ్.ఎల్.ఎ ల ఇళ్ళ ముందు ధర్నా, 29 వ తేదీన కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు, ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు తాడిశెట్టి గంగా, సిఐటియు నాసకులు డి.క్రాంతి కుమార్, పెదిరెడ్ల విష్ణు, లంక చంటి, కార్పెంటర్స్ యూనియన్ రమణ, ఏగుపాటి అర్జునరావు, బొడ్డు అప్పన్న, మిడ్డే మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కరక సుబ్బలక్ష్మీ, అంగన్ వాడీ యూనియన్ నాయకులు చల్లా స్నేహలతా, సావిత్రి, లక్ష్మీ, నీలపాల సూరిబాబు, ఎస్.శ్రీనివాస్, కృష్ణ, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్వచ్ఛంద సంస్థల నూతన కార్యావర్గం ఎంపిక



కాకినాడ : జిల్లా స్వచ్ఛంద సంస్థలకు కాకినాడలో స్వచ్ఛంద సేవ సంస్థల సమైక్య భవన్ ఏర్పాటు చేసి ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలను గుర్తించి వారికి సహకరించాలని గతంలో స్వచ్ఛంద సేవ సంస్థల చైర్మన్లు కార్యావర్గ సభ్యుల సేవలు మరువలేవని సింహాద్రి అన్నారు. వాళ్ళ సేవ స్ఫూర్తితో అందరం పనిచేస్తామని అన్నారు. బుధవారం స్థానిక గాంధీ భావనము నందు జరిగిన జిల్లా స్వచ్ఛంద సంస్థల సమైక్య సమావేశంలో అయన మాట్లాడాతు కరోనా సమయంలో స్వచ్ఛంద సేవ సంస్థల సేవలు వెలకట్టలేవని అన్నారు. ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి పేదలకు ప్రభుత్వ పథకాలు అందేలా సేవ సంస్థల కృషిచేస్తాయని సింహాద్రి చెప్పారు. ఉదయం సమైక్య సమావేశాన్ని అధ్యక్షత వహించిన యమ్.జి.కె. రాజు మాట్లాడుతూ సమైక్యాను బలోపేతం చేయడానికి కార్యవర్గం ఎంపిక అవసరమని అన్నారు. తరువాత స్వచ్ఛంద సేవాసంస్థల పాత్ర గుర్చి సాలార్ మాట్లాడారు.

**నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక**

1. కాసరపు. సింహాద్రి - చైర్మన్ 2. పలివెల. జనార్ధన్ - జనరల్ సెక్రటరీ 3. గుత్తుల.దీన్ బాబు - వైస్ ప్రెసిడెంట్ 4. పలివెల.సత్యానందం - వైస్ ప్రెసిడెంట్ 5. వనవాసి.అనుదీప్ - వైస్ ప్రెసిడెంట్ 6. టి. భగవాన్ - వైస్ ప్రెసిడెంట్ 7. కరగాని.వరలక్ష్మి - జాయింట్ సెక్రటరీ 8. కాపవరపు.కుమార్ - జాయిన్ సెక్రటరీ 9. పాలేపు.కామేశ్వరి - ట్రేజరర్ 10. యమ్.జి.కె.రాజు - గౌరవ అధ్యక్షులు ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న 93 స్వచ్ఛంద సేవసంస్థల ప్రతినిధులు పాల్గొని జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికోవడమైనది.




ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

## పారిశుధ్య కార్మికుల సమస్యలపై ధర్నా

గొలుగొండ : గ్రామ పంచాయతీ పారిశుద్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం గొలుగొండ ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గొలుగొండ మండంలో పంచాయతీలలో పని చేస్తున్న పారిశుద్య కార్మికులకు జీతాలు బకాయిలను చెల్లించాలన్నారు. కరోనా నేపథ్యంలో కేంద్రం ప్రవేశపెట్టిన ప్రమాద బీమా రూ.50లక్షలు అమలు చేయాలని, కార్మికులను పర్మినెంట్ చేసి ప్రతీ నెల జీతాలు చెల్లించాలని, ఇఎస్ఐ, పిఎఫ్‌లు అమలు చేయాలని కోరారు.

పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించా లన్నారు.కరోనా భీమా రూ.50లక్షలు వర్తింపజేయాలన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. కనీస వేతనాలు రూ.18వేలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ఎం.అప్పా రావు, వై.రాజు, పి.లోవరాజు, చెవ్వేటి అర్జున పాల్గొన్నారు.

## హిందు దేవాలయాలను పరిరక్షించాలి... హిందు సాంప్రదాయాన్ని గౌరవించాలి

ములగాడ: హిందు దేవాలయాలను పరిరక్షించాలని.. హిందు సాంప్రదాయాన్ని గౌరవించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విశాఖ పశ్చిమ 59వ వార్డ్ తెదేపా కార్పొరేటర్ అభ్యర్ధి లాలం లావణ్య డిమాండ్ చేశారు. అనాదిగా వస్తున్న శ్రీవారి ఆలయ దర్శనం కు వచ్చే భక్తులు డిక్లరేషన్ ఇవ్వాలనే నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం తుంగలో తొక్కి హిందువుల మనోభావాలతో ఆటలాడుతున్నందుకు నిరసనగా పారిశ్రామిక ప్రాంతం జింక్ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద 59వ వార్డ్ తెదేపా కార్పొరేటర్ అభ్యర్థి లాలం లావణ్య ఆధ్వర్యంలో తేదేపా శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా లాలం లావణ్య మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు గణబాబు ఆదేశాల మేరకుగాజువాక డిపో ఆంజనేయస్వామి దేవాలయం వద్ద దేవాలయాల పరిరక్షణకై నిరసన తెలియజేసే కార్యక్రమం చేపట్టామని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ తిరుమల సాంప్రదాయల ప్రకారం డిక్లరేషన్ పై సంతకం పెట్టి శ్రీవారిని దర్శించు కోవాలని కోరుకుంటున్నామని తెలిపారు.

పాలకులే నిబంధనలను ఉల్లంఘనకు పాల్పడడం అత్యంత అవమానకర విషయమని అన్నారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### మంత్రి అవంతీ కరోనా నుంచి కోలుకోవాలని లక్ష్మీపురం గ్రామంలో గల

## శ్రీశ్రీశ్రీ అయ్యప్పస్వామి సేవాపీఠం వద్ద పూజలు

భీమునిపట్నం : భీమిలి మండలం లక్ష్మీపురం గ్రామంలో గల శ్రీ శ్రీ శ్రీ అయ్యప్పస్వామి సేవాపీఠం వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ముత్తం శెట్టి శ్రీనివాసరావు కరోనా నుండి పూర్తిగా కోలుకోవాలని గురువారం అనగా బుధవారం పూజలు నిర్వహించనున్నట్లు భీమునిపట్నం రూరల్ మండలం వర్కింగ్ ప్రెసిడెంట్ గాడు శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు గాను గణపతిపూజ కార్యక్రమము మరియు "చండీ హోమం" కార్యక్రమము గురువారం ఉదయం 8 గంటలు నుండి 12 గంటలు వరకు శ్రీశ్రీశ్రీ అయ్యప్పస్వామిసేవాపీఠం,లక్ష్మీపురం వద్ద జరుగుననీ, పూజాకార్యక్రమము జరుగుననీ చెప్పారు.కావున భీమిలి రూరల్ మండలంలో గల నాయకులు అందరు పాల్గొని జయప్రదము చేయవలసినిధిగా ఆయన కోరారు.

# ఆధార్ కార్డులు మార్పిడితో ప్రభుత్వ పథకాలకు చిల్లు

**- విజిలెన్సు దాడులతో బయటపడుతున్న మోసాలు - బాధ్యులపై కఠిన చర్యలకు సీపీఎం డిమాండ్**





దేవరాపల్లి : మాడుగుల నియోజకవర్గం లో అదారకార్డులో వయస్సులు మార్పిడి చేస్తు అడ్డగోలుగా ఆదికార పార్టికి చేందిన కోంతమంది పెన్షన్లు కుంభకోణానికి పాల్పుడుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న పేర్కొన్నారు. బుధవారం అయిన ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వి ,మాడుగుల నియోజకవర్గం పరిధిలోని కె. కోటపాడు, దేవరాపల్లి, చీడికాడ మండలాల్లో తమపార్టి కార్యకర్తలకు చెందిన వారికి వయస్సు తక్కువ ఉన్న అదారకార్డుల్లో వయస్సు ఎక్కవగా మార్చుకోని అడ్డగోలుగా పింఛన్లను పోందుతూ ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని తెలిపారు. గత సంవత్సరం చివరి లో కె కోటపాడు మండల కేంద్రంలో ఈ సేవలో ఆధార్ కార్డులు కుంభకోణం బైటపడగా శనివారం దేవరా పల్లిలో విజిలెన్స్ అదికారులు దాడులు చేయగా ఒక ఈ సేవలో ఆధార్ కార్డులు కుంభకోణం బయటపడటం జరిగింది. మిగిలిన రెండు మండలాలు చీడికాడ, వి.మాడుగులలో ధర్యాప్తులు జరిపితే, మరింత కుంభకోణాలు బయటపడే అవకాశాలు లేకపోలేదని అన్నారు. దినికి అదికార పార్టీ నాయకులే కీలక పాత్ర పోషించారని తెలిపారు. దేవరాపల్లి మండలంలోని ఈ సేవలకు అచ్చుతాపురం, రాంబిల్లి, మునగపాక మండలాలుకు చేందిన వైసీపీ కార్యకర్తలు ఆధార్ కార్డులుకు 10 నుంచి 15 వేలు వరకు వసూళ్లు చేసి తెస్తున్నారని మరి కోంతమంది కార్యకర్తలు ఓటు బ్యాంక్ కోసం గ్రామాల్లో తీరిగి 25 కార్డులుకు లక్షరూపాయలు బేరం కుదుర్చుకోని నకిలీ ఆధార్ కార్డులు, ఆధార్ కార్డుల్లో వయస్సులు మార్పిడిలు చేస్తున్నారని తెలిపారు. ఇంత జరుగుతున్న కన్నంలో దోరికిన దోంగలాగ ఆదికారపార్టి ప్రజాప్రతినిధులు నోరు మెదపడం లేదన్నారు. స్వచ్ఛమైన నిజాయితీ గల పరిపాలన అందిస్తామని రాజకీయాలుకు అతీతంగా పరిపాలనా సాగించి సంక్షేమ పథాకాలు, స్కీములు వర్తింపచేస్తామని వాగ్దానాలుచేసి అదికారం లోకి వచ్చిన ఆదికార పార్టి నాయకులు నేడు ఓటు బ్యాంక్ పెంచు కోవడం కోసం వయో పరిమితుల్లో మార్పులు చేసి అసలైన పేదలకు, అర్హులైన వారికి పెన్షన్లు అందకుండచేసి వారి కార్యకర్తలుకు మాత్రమే పెన్షన్లు అందేవిదంగా చూస్తున్నారని ఆరోపించారు. ఆధార్ కార్డులు వయోపరిమితులు మార్పులు విషయంలో విజెలేన్స్ అధికారులు రాజకీయాలుకు తలొగ్గకుండ ని పక్షపాతంగా దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని వెంకన్న డిమాండ్ చేశారు.

# ఘనంగా బేసిక్ మెడికల్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం



ఏలేశ్వరం : తూ.గో.జిల్లా ఏలేశ్వరం మండలం ఏలేశ్వరం లారీ మోటార్ వెహికల్స్ యూనియన్ కళ్యాణ మండపం నందు బేసిక్ మెడికల్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం. బుధవారం ఏలేశ్వరం యూనియన్ సభ్యులు రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బఱ్రే.నరసింహమూర్తి, అసోసియేషన్ గౌ.సలహాదారు, ఏలేశ్వరం మండలం అధ్యక్షుడు ఆర్.శ్యామ్ కుమార్ అధ్యక్షతన ఘనంగా జరిగింది.ఈ సమావేశంలో సాయి ఆర్థోపెడిక్ అధినేత డా. నీలి.ఉమామహేశ్వరరావు, డా.నాయుడు అధ్యక్షత ప్రస్తుత పరిస్థితులలో కోవిడ్-19 పై తీసుకోవలసిన జాగ్రత్తలు,ఎముకలు పటిష్టత పై మరియు వాటిపై తీసుకోవసిన జాగ్రత్తలపై శిక్షణ తరగతులు నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా బేసిక్ మెడికల్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.వి.కృష్ణారావు, ఉపాధ్యక్షులు పదిలం.బెన్నబాబు, యస్.రాము, సెక్రటరీ శిరికి. శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ షేక్ ఆశిక్,అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అద్దంకి సూర్య, సెక్రటరీ యస్.మురళీధర్ మరియు పి.యల్.ఆచార్యులు హాజరైనారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి. కృష్ణారావు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ నిభందలు ప్రకారం కోవిడ్-19 కేసులు చూడరాదని,అటువంటి కేసులు ఏమైనా ఉంటే దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులకు పంపిచాలని తెలిపారు.అదేవిధంగా గతంలో 429జీవో ప్రకారం ఇచ్చిన కమ్యూనిటీ పారా మెడికల్ ట్రైనింగ్ పునఃరుద్ధరణ కొరకు అసోసియేషన్ తరపున గౌ.ముఖ్యమంత్రి వర్యులు జగన్మోహన్ రెడ్డి గారిని త్వరలో కలిసి ట్రైనింగ్ పునఃరుద్ధరణ కొరకై వైసీపీ వైద్య విభాగం ద్వారా కలుస్తామని తెలిపారు.ఈ కార్య క్రమంలో యు.రామస్వామి, రామలింగేశ్వరరావు, ఎం.డి.రాజు, వి.సూరిబాబు, జనార్ధన్ మరియు సుమారు 90 మంది సభ్యులు హాజరైనారు.

# గవరవరం పిహెచ్‌సిని సందర్శించిన ముక్త భారత్ ప్రోగ్రాం అధికారి

**ఈనెల 28 నుండి ముక్త భారత్**



చోడవరం : మండలంలోని గవరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ముక్త భారత్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ చంద్రశేఖర్, హెల్త్ ఎడ్యుకేషన్ అధికారిని బేగం బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ముక్త భారత్ కార్యక్రమం అమలుపై పి హెచ్ సి వైద్యాధికారి ని డాక్టర్ దమయంతి దేవి, సి హెచ్ వో శ్యామల దేవికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 28 నుండి ఎనిమియా ముక్త భారత్ కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందన్నారు. 6 నెలల నుండి 19 సంవత్సరాల పిల్లలకు, 20 నుండి 49 ఏళ్ళు నెలకు రక్త పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఐరన్ మాత్రలు, టానిక్ లు పంపిణీ చేయడం జరుగు తుందన్నారు. అలాగే కోవిడ్ - 19 పరీక్షలు, తణుకు అనుసరిం చాల్సిన అంశాలపై వైద్య సిబ్బందితో చర్చించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు రామకృష్ణ, కళావతి, నాగేశ్వరరావు, శ్రీనివాస్, సత్యవతి, లలిత ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

# అన్నవరం లో భారీగా అక్రమ మద్యం పట్టివేత



అన్నవరం : తూర్పుగోదావరి జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీ అద్నాన్ నయీమ్ అస్మి, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్.పి. డాక్టర్ సునీల్ సుమిత్ గరుడ్ గారికి రాబడిన సమాచారం పై పెద్దాపురం డి.ఎస్.పి. అరిటాకుల శ్రీనివాసరావు ,ప్రత్తిపాడు సి.ఐ. వై.రాంబాబు పర్యవేక్షణలో అన్నవరం పోలీస్ స్టేషన్ ఎస్.ఐ ఎస్. రవికుమార్ అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో గల రౌతులపూడి మండలం ఎస్.అగ్రహారం పంచాయతీ శివారు బిళ్ళపాక ప్రాంతం వద్ద ఖాళీ స్థలంలో లారీలో ఉన్న అక్రమ మద్యంను బోలోరో వ్యాన్, స్కార్పియో కారులోనికి కొందరు వ్యక్తులు మద్యం బాటిల్స్ ను లోడ్ చేయుచున్నారని దానిపై పోలీసు వారు అక్కడికి వెళ్లి అక్కడ వెళ్లి అక్కడ లారీలో ఉన్న 250 కేసుల మద్యం బాటిల్స్ లను లారీ నుండి బొలెరో వాహనంలోకి, స్కార్పియో కారులోకి లోడ్ చేస్తుండగా 6 గురు వ్యక్తులను అరెస్టు చేసి ప్రాపర్టీ మొత్తం ను స్వాధీనంము చేసుకోవడమైనది. సదరు లారీలో పేయి%శీ%టింగ్ డబ్బాలు లోడులో అక్రమంగా మద్యం బాటిల్స్ ను అనుమానం రాకుండా లోడ్ చేసినారు. రావులపాలెం కు చెందిన పెద్దిరాజు అలియాస్ రెడ్డికి, జగ్గంపేట మండలం మల్లిసాల గ్రామస్తుడైన రాళ్లపల్లి నాగేశ్వరరావు, రాజవొమ్మంగి మండలం దూసరపాము గ్రామానికి చెందిన కరణం సూరిబాబుకి పరిచయం అయి సదరు పెద్దిరాజు అక్రమ మద్యం రవాణా గురించి చెప్పగా అతను మద్యం బాటిల్స్ సప్లై చేస్తానని చెప్పి లారీలో మద్యం బాటిల్స్ లోడు ది. 22-9-2020 వ తేదీన ఉదయం తీసుకువచ్చి పెద్దిరాజు కారులో వచ్చారు.



ఈ సందర్భంగా ఎస్.ఐ రవికుమార్ లారీ నుండి మద్యం బాటిల్స్ బోలోరో వ్యాన్ లోకి,స్కార్పియో కారులోకి లోడ్ చేస్తుండగా వారిని పోలీసు సిబ్బంది సహాయంతో చుట్టు ముట్టి రాళ్లపల్లి నాగేశ్వరరావు మల్లిసాల, కరణం సూరిబాబు దూసరపాము, చింతలపూడి విశాఖపట్నం జిల్లా,వెలిక వెంకటరమణ నడీమ్ పాలెం, విశాఖపట్నం రూరల్ , చుక్కల శ్రీనివాసరావు కె. డి. పేట, కర్రి నాగేశ్వరరావు మాకవరం, విశాఖ జిల్లా, జాదవ్ అశోక్ నాయక్ హైదరాబాద్ అను వారిని అరెస్ట్ చేయడం అయినది. లారీ డ్రైవర్ సువర్ణ సింగ్, పెద్ది రాజు అలియాస్ రెడ్డి, సుబ్రమణ్యం బోలోరో వ్యాన్ డ్రైవర్, స్కార్పియో కార్ డ్రైవర్ పరారైనారు. అరెస్ట్ చేసిన 6 గురిని ది. 23-09-2020 తేదీ ఉదయం పెద్దాపురం ఇంచార్జ్ కోర్ట్, మెజిస్ట్రేట్ గారి వద్ద హాజరుపర్చినట్లు పెద్దాపురం డి.ఎస్.పి తెలియజ్జేసారు.సీజ్ చేసిన ప్రాపర్టీ యొక్క వివరాలు 250 కేసుల మధ్యం,క్వార్టర్ బాటిల్స్ 12000 వేలు.అయితే వాటి విలువ సుమారు 24 లక్షల రూపాయలు,లారీ, బోలోరో వ్యాన్, స్కార్పియో కార్ విలువ సుమారు 36 లక్షలు, ముద్దాయిల వద్ద నుండి సీజ్ చేసిన క్యాష్ 13000/- మొత్తం 60,13,000/- రూపాయలు విలువ గల ప్రాపర్టీ ని వారి వద్దనుండి స్వాధీనపర్చుకొన్నట్లు డి.ఎస్.పి. గారు తెలియపరిచారు.ప్రత్తిపాడు సి.ఐ. వై రాంబాబు,ఎస్.ఐ. ఎస్.రవి కుమార్‌ని మరియు వారి సిబ్బందిని డి.ఎస్.పి అభినందించారు.

# గుమ్మళ్ళపూడి దళితులకు న్యాయం చేయాలి



దేవరాపల్లి : రావికమతం మండలం గుమ్మళ్లపూడి గ్రామ దళితులను సాంఘిక బహిష్కరణ చేసిన వారిని కఠినంగా శిక్షించాలని దేవరాపల్లి అంబేద్కర్ యూత్ సంఘం అధ్యక్షులు కాటపల్లి అప్పారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం సంఘం సభ్యులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ గ్రామంలోని దళిత యువతిని పెత్తందారు యువకుడు వివాహం చేసుకున్నాడన్న నెపంతో గ్రామ దళితులను సాంఘిక బహిష్కరణకు గురి చేయడం శోచనీయమన్నారు. అంతే కాకుండా కిరాణా, పాలు, పొలాలకు రానిస్తే వారికి 5 వేల రూపాయలు జరిమానా విధించడం చూస్తే ఇంకా కుల వివక్ష ఏ మేరకు గ్రామాల్లో తాండవిస్తుందో అర్థమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికార యంత్రంగం వెంటనే చర్యలు చేపట్టాలని, భాద్యులపై ఎస్ సి, ఎస్ టి అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దళితుల భూములకు రక్షణ కల్పించండి



అనకాపల్లి : దళితుల భూములకు రక్షణ కల్పించాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ శ్రీనివాసరావు కు రూరల్ జిల్లా దళిత సేన అధ్యక్షుడు లంబా శ్రీనివాస రావు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గొలగాం గ్రామం గుమస్తాల కాలనీలో సర్వే నెంబర్ 88 లో గుంట అప్పారావు లక్ష్మి దంపతులు నివాసం ఉండేవారు. జీవనోపాధి నిమిత్తం ఆ ఇంటిని విడిచి మద్రాసుకు వలస పోయిన నేపథ్యంలో ఖాళీగా ఉన్న తమ ఇంటి పై స్థానిక రాజకీయ నాయకుల కళ్ళు పడటంతో లక్ష్మి కి కేటాయించిన స్థలాన్ని ఆక్రమించి వేరొకరికి అమ్మేశారని దీనిపై అడ్డుకుంటే లక్ష్మి వారి కుటుంబ సభ్యులపై దాడి చేసి గాయపరిచారు అన్యాయంగా తొలగించారు అన్నారు.

1983లో గుంట్ల లక్ష్మికి సర్వే నెంబర్ 88 ఫ్లాట్ నెంబర్ 42 పట్టా ఇవ్వడమే కాకుండా హౌసింగ్ లోను కూడా మంజూరు చేయడం జరిగిందని గుర్తు చేశారు. అన్ని హక్కులు కలిగిన ఆ ఇంటిని కాపాడు కునేందుకు 17 సెప్టెంబర్ 2020లో హైకోర్టును ఆశ్రయించడం జరిగిందని దీనిపై హైకోర్టు స్టే కూడా ఇవ్వడం జరిగిందన్నారు.

దీనిపై రెవెన్యూ శాఖ అధికారులు స్పందించి వారి భూమిని రక్షించేందుకు చర్యలు చేపట్టాలని అలాగే ఇలాంటి సమస్యలు ఎదుర్కొంటున్న దళితుల భూములకు రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నట్లు లంబా శ్రీనివాసరావు తెలిపారు.

# వ్యవసాయ బిల్లులు వెనక్కి తీసుకోవాలి



అనకాపల్లి : వ్యవసాయ రంగం నాశనం చేసి, రైతులును మోసం చేసే వ్యవసాయ రంగ బిల్లులును వెనకకు తీసుకోవాలని మోడీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజాన దొరబాబు ఆధ్వర్యంలో అనకాపల్లి నెహ్రూ చౌక్ లో ర్యాలీ, వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాజాన దొరబాబు మాట్లాడుతూ వ్యవసాయ రంగం మీద ఆధారపడి జీవిస్తున్న చిన్న, సన్నకారు రైతులు జీవితాలు కుదేలు అయ్యే ప్రమాదం ఉందని, కార్పొరేట్ కంపినీలకు తప్ప రైతాంగానికి ఎలాంటి ప్రయోజనం ఉండదని దొరబాబు విమర్శించారు. విపక్షాలు వ్యతిరేకించిన, రాజ్యసభ లో మెజారిటీ లేకపోయినా వ్యవసాయ రంగ బిల్లులు బలవంతంగా ఆమోదించడంలో ఉన్న ఆంతర్యం ఏమిటని దొరబాబు ప్రశ్నించారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వియ్యపు రాజు, డొక్కరి హరీష్, నరాలశెట్టి నత్యనారాయణ, సాయి లక్ష్మణ్, కొల్లి సత్యారావు పోతురాజు, ఇమంది శ్రీనివాస్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఆర్ఈజిఎస్ లో కాఫీ తోటల పెంపకాన్ని చేర్చాలి



అనకాపల్లి : విశాఖ జిల్లా తూర్పు కనుమల్లో గిరిజన రైతుల వ్యవసాయానికి సంబంధించి విశేష ప్రాధాన్యత కలిగిన కాఫీ తోటల పెంపకాన్ని మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో చేర్చాలని స్పీకర్ ద్వారా ప్రభుత్వాన్ని అనకాపల్లి ఎంపీ సత్యవతి కోరారు. విశేష ఆదరణ కలిగిన ఈ పంట పై గిరిజన రైతులు ఆధార్ పడ్డారని ఇది ఆదాయాన్ని సమకూర్చే పంటగా గుర్తు చేశారు. ఎం ఎన్ ఆర్ ఈ.జి ఎస్ నిధుల్లో గిరిజన నిధులు వేతన భాగాన్ని మాత్రమే తీసుకుంటున్నారనారు.

ఇటీవల కాలంలో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఈ పథకాన్ని కాఫీ తోటల పెంపకం లో తొలగించింది అన్నారు. కేరళలో రబ్బర్ పెంపకానికి ప్రోత్సాహం అందిస్తున్నట్లే ఆంధ్రప్రదేశ్లో ప్రాచుర్యంలో ఉన్న కాఫీ తోటల పెంపకానికి ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా సహకరించాలని కోరారు.

# కొడాలి నానిని తక్షణం మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలి




కడప : హిందూ దేవుళ్లపై విగ్రహాలపై కన్ను మిన్ను కానరాక, కండ్ల కావరంతో హిందువుల ఆత్మాభిమాన్ని, ఆత్మగౌరవాన్ని, మనో భావాలను దెబ్బతీసే విదంగా అహంకారంతో మాట్లాడిన మంత్రి కొడాలి వెంకటేశ్వరరావు(నాని)ను మంత్రి వర్గం నుండి తక్షణం బర్తరఫ్ చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తెదేపా రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. కడప నగరంలోని తెదేపా జిల్లా కార్యా లయంలో బుధవారం 'రెడ్యం' విలేకరులతో మాట్లాడుతూ దేవుని విగ్రహల్ని బొమ్మలంటాడా! ఆంజనేయస్వామి చేయి విరిగితె బొమ్మ కదా పోయేదేముం దంటారా..! రథం కాలితె కొత్త రథం చేయిస్తామని, దుర్గమ్మ వెండి ఉత్సవ రథం సింహాలు మాయమైతే 10కేజీల వెండే కదా అనినీచంగా అహంకారంతో అనుచితంగా, అసందర్భ ప్రేలాపనలు చేయడం చూస్తే కొడాలి నానిది నాలుకా,తాటి మట్టా అని ప్రశ్నిస్తూ మనిషా, రాక్షసుడా అని తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. కొడాలి నాని అహంకారపూరిత మాటలతో ఏపీ సాదు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి కంటతడి పెట్టారంటే ఆమాటలు హిందూమనోభావాలను ఏ విదంగా దెబ్బతీశాయ నేందుకు ప్రత్యక్ష ఉదాహరణగా ఆయన పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో హిందూ దేవాలయాల్లో ఏ చిన్న పొరపాటు జరిగినా పెద్ద ఎత్తున రాద్ధాంతం చేసే స్వరూపా నంద స్వామి హిందూదేవాలయాలపై పెద్దఎత్తున దాడులు జరుగు తుంటే నోరు మెదపకపోవడం వైసీపీ కి అనుకూల వైరమేనని పేర్కొంటూ స్వామిజీలు పార్టీలకు అనుకూలం ఏమిటని ఆయన మండిపడ్డారు. అన్యమతస్తులు శ్రీవారిని దర్శించు కునేందుకు వస్తే డిక్లరేషన్ ఇవ్వాల్సిందేనని నాడు రాష్ట్రపతి, ప్రధానులు సైతం సంతకం చేశారన్నారు.సంతకం చేయక పోతే శ్రీవారి గుడి అపవిత్ర మవుతుందా? డిక్లరేషన్ ఎవరు పెట్టారని, కొడాలినాని మాట్లా డడంపై ఆయన మండిపడ్డారు.

టీటీడీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి సైతం సంతకానికి వ్యతిరేకంగా మాట్లాడినందున తక్షణం ఆయన్ను ఆ ఛైర్మెన్ పదవినుండి తొలగించాలని ముఖ్యమంత్రిని ఆయన డిమాండ్ చేశారు. హిందూ మనోభావాల్ని, నమ్మకాన్ని దెబ్బతీసిన వారెంతటివారైనా చరిత్ర హీనులు అవుతారని హెచ్చరిస్తూ..తక్షణం దీనిపై ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటన చేయాలని, వివరణ ఇవ్వాలని రెడ్యం డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో తెదేపా నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ జిలానీ భాషా, వికాస్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



*విశాఖ పార్లమెంట్ వర్కింగ్ ప్రెసిడెంట్ బెహరా భాస్కర్ రావు పుట్టిన రోజు సందర్భంగా వార్డు అధ్యక్షులు, కార్పొరేటర్ అభ్యర్ధులు మరియు పార్టీ నాయకులుతో కలిసి పుట్టిన రోజు శుభాకంక్షలు తెలియజేసిన మాజీ ఎమ్మెల్యే, విశాఖ పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ విజయ ప్రసాద్ మళ్ళ*

## జాతీయ సేవ పథకకార్యక్రమాలలో
# సెయింట్ ఆన్స్ ను అగ్రస్థానంలో నిలుపుతున్న అక్కచెల్లెళ్ళు





గాజువాక : వారిరువురు స్వయానా అక్కచెల్లెళ్ళు. ఇద్దరూ జాతీయ సేవ పథక ప్రోగ్రాం అధికారులే. పని తీరులో ఒకరితో ఒకరు పోటీ పడుతూ సెయింట్ ఆన్స్ కళాశాల వాలంటీర్లను సేవా కార్యక్రమాలలో అగ్రభాగాన నిలబెడుతున్నారు. వారే ఇపియస్ భాగ్యలక్ష్మి... వై అనసూయదేవి. ఒకరు (భాగ్యలక్ష్మి)జాతీయ స్థాయిలో అవార్డు అందుకోగా, మరొకరు (అనసూయ) రాష్ట్ర స్థాయి అవార్డు అందుకొని పలువురు ప్రశంసలు పొందుతున్నారు. వీరి ఆధ్వర్యంలో వేలాదిమంది విద్యార్థినిలు సేవ కార్యక్రమంలో చక్కటి శిక్షణ పొంది అవార్డులు రివార్డులు అందుకొని నాయకత్వ స్థానాలలో ప్రతిభ కనబరుస్తున్నారు. సెప్టెంబర్ 24వ తేదీ జాతీయ సేవ పథక దినోత్సవ సందర్భంగా... పారిశ్రామిక ప్రాంతంలో వీరిని అంతా అభినందనలతో ముంచెత్తుతున్నారు.

# సత్యదేవుని హుండీల ఆదాయం
## గడిచిన 34 రోజులకు రూ.42.18 లక్షలు



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి హుండీలు బుధవారం లెక్కించారు. హుండీల లెక్కింపు ఆదాయం గడచిన 34 రోజులకు రూ.42,18,738/- (అక్షరాల నలభై రెండు లక్షల, పద్దెనిమిది వేల,ఏడు వందల ముప్పై ఎనిమిది రూపాయలు) రాగా బంగారం 58 గ్రాములు వెండి 470 గ్రాముల తో పాటు రద్దయిన పాత నోట్లు రూ.1500/- లభ్య మయ్యాయి. ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం కార్య నిర్వహణాధికారి వి.త్రినాధరావు,ఏసి రమేష్ బాబు, ఏఈవో భ్రమరాంబ,పిఆర్వో కొండలరావు, దేవస్థానం అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నూతన తహశీల్దార్ ను కలిసిన
# మండల వైసీపీ నాయకులు



పరవాడ : పరవాడ తహశీల్దార్ గా నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన బి.వి రాణి ని బుధవారము మండలములో గల వైసిపి నాయకులు కలిసి హార్దికశుభాకాంక్షలు తెలిపారు.

అనంతరము పుష్పగుచ్ఛం ఇచ్చి రాష్ట్ర సిఇసిసభ్యులు పైల శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు , పెందుర్తి మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ పైల అప్పల నాయుడు, మాజీ అర్ ఇసిఅస్ ఛైర్మన్ చెల్ల కానకరావ్, మాజీ ఎం.పి.టి.సి సీత రామయ్య, గొర్లి గోపి, వెన్నెల సన్యాసిరావు, వెన్నెల అప్పా రావు, కోరుకొండ రమణ, బొబ్బిలి సత్యనారాయణ, కిరణ్ చంద్, ఒమ్మి అర్జున్ రావు, గొర్లివాన్నిపాలెం మాజీ సర్పంచ్ గొర్లి ఎరుకునాయుడు, నందవరపు శ్రీను, గంగరాజు, కలవలపల్లి సత్యనారాయణ తదితరులు పుష్ప గుచ్ఛము ఇచ్చి అభినందనలు తెలియజేశారు.

## నియోజకవర్గం యాదవ్ సంఘం అధ్యక్షునిగా
# రాము నియామకం



దేవరాపల్లి : మాడుగుల నియోజకవర్గం శ్రీ కృష్ణ యాదవ్ సేవా సంఘం అధ్యక్షునిగా కిల్లాన రాము నియమితులయ్యారు. మండలంలోని తెనుగుపూడి గ్రామానికి చెందిన రాము ఎంపిక పట్ల నియోజకవర్గం సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈయన రెండేళ్లు పాటు పదవి కాలంలో ఉంది సేవా కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరికుమార్ నియామక పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ఐదేళు ్లగా సంఘంలో చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి తనకు ఈ బాధ్యతను అప్పగించారన్నారు.

# 10 లీటర్ల
## నాటుసారా స్వాధీనం
## నిందుతుడు అరెస్టు



అచ్యుతాపురం : మండలంలో తంతడి గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు.

ఈ దాడుల్లో 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని నిండుతుడు బొంది కృష్ణ పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి లక్ష్మణరావు తెలిపారు.

# వేచలం పిహెచ్‌సి ఆకస్మిక తనిఖీ



దేవరాపల్లి : మండలంలోని వేచలం పి హెచ్ సి ను జిల్లా డివిజన్ అడిషినల్ వైద్యాధికారిణి వసుంధర బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పి హెచ్ సి నిర్వహణ, కోవిడ్ పరీక్షలు తీరు, టి బి రోగులకు అందిస్తున్న మందుల రికార్డులను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. పి హెచ్ సి సమస్యలు స్థానిక వైద్యాధికారిణి బి. హారికను అడిగి తెలుసు కున్నారు. అదే విధంగా బుధవారం ఆసుపత్రిలో వి ఎల్ ఎం ఎస్ 17, ఆర్. డి. టి 8 కోవిడ్ పరీక్షలు నిర్వహించామని వైద్యులు తెలిపారు. వీరందరికి నెగిటివ్ రిపోర్ట్ వచ్చిందన్నారు.

# ఎస్సీ రిజర్వేషన్ ప్రక్రియ చంద్రబాబు సృష్టే

కాకినాడ : ఎస్సీ రిజర్వేషన్ పక్రియ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సృష్టి అని ఆంధ్రప్రదేశ్ దళిత ఉద్యోగ సంఘాల అధ్యక్షులు నక్కా రాజశేఖర్ ఆరోపించారు. అన్నదమ్ము లుగా ఉన్న మాల మాదిగల మధ్య చిచ్చు పెట్టారని రిజర్వేషన్ బీజాన్ని నాటరన్నారు. బుధవారం పాత్రికేయులతో మాట్లాడుతూ అనాడు పార్టీలో పదవులు కోసం మాల నేతలు ఎవరు మాట్లాడలేదని అధికారం పోయేసరికి రిజర్వేషన్ పక్రియలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, ఎంపీలపై లేనిపోని ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు.గతంలో ప్రతి పక్ష నేతగా ఉన్న జగన్ మోహన్ రెడ్డి ఈఅంశం పై సుప్రీంకోర్ట్ పరధిలో ఉన్న ఈఅంశంపై నేను మాట్లాడను అని చెప్పిన సంగతి టీడీపీ నేతలకు గుర్తు లేదా అని ప్రశ్నించారు.పార్లమెంట్‌లో ఎంపీలు వర్గీకరణ అంశంపై కేంద్రాన్ని వివరాణ కోరగాదీనిపై కేంద్రం న్యాయ సేక సహాయ మంత్రిమాట్లాడుతూ ఇప్పటికే 14రాష్టాలు ఈ అంశంపై వర్గీకరణకు అనుకూలంగా నివేదికలు సమర్పించాయని అయితే ఉప కులాల వర్గీకరణ జరుపుకునే హక్కు రాష్ట్రలకు ఉందని కేంద్రం ఎక్కడ చెప్పలేదని స్పష్టంగా చెప్పారన్నారు. 2004-11-5న చెన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్ తీర్పు యదాతతంగా కొనసాగుతుందని ప్రకటించారు. ఈపరిణామాలు సోదరులు గుర్తించాలన్నారు.బాబాసాహెబ్ అంబేద్కర్ నాయకత్వంలో ఆర్టికల్ 14, 15,16 మరియు 341, 342లో ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్‌లు పొందుపరిచారని వీటిని సవరించే అధికారం పార్లమెంట్ కే ఉందని స్పష్టంగా పేర్కొన్నారని 28-8-2020 నాడు సుప్రీంకోర్టు అగ్ర కులాల జడ్జిలు 2004తీర్పు పున సమీక్షించేందుకు 9 మంది జడ్జిలతో బెంచ్‌కు రికమండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని,దీనిపై న్యాయపోరాటఉద్యమం చేస్తామని రాజశేఖర్ హెచ్చరించారు.దళితుల ఐక్యత ఉమ్మడి రిజర్వేషన్‌లు మాత్రమే మాల మహానాడు కోరుకుంటుదని ఎస్సీ వర్గీకరణకు ఏ రాజకీయ పార్టీ మద్దత్తు పలికిన తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందన్నారు.


## మోడీ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా
# దేశవ్యాప్త పోరాటాలకు సిద్ధంకండి
## - సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు

విశాఖపట్నం : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మనం పోరాడి సాధించుకున్న హక్కులు, మన ఉద్యోగాలు, వేతనాలు, జీవనోపాధి, సహజవనరులు, జాతీయ సంపదలపై దాడి చేస్తున్నదని దీనిపై దేశవ్యాప్తంగా అన్ని తరగతుల ప్రజలు పోరాటాలకు సిద్ధంకావాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు పిలుపునిచ్చారు. మోడీ అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ రోజు విశాఖలోని అంబేద్కర్ విగ్రహం నుండి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన అనంతరం సభ జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిహెచ్.నరసింగరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలన్నింటిని కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలైన అంబానీ, అదానిలకు కట్టబెడుతుందన్నారు. వ్యవసాయ రంగంలో రైతాంగానికి నష్టం చేసే బిల్లును పార్లమెంట్‌లో ఏకపక్షంగా ఆమోదించుకొని రైతులకు తీరని ద్రోహం చేసిందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 రకాల కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి బిల్లు ఆమోదింపజేసుకొని కార్మికులను యాజమాన్యాలకు కట్టుబానిసలుగా చేసిందన్నారు. కరోనా కాలంలో ప్రజలను, కార్మికులను ఆదుకోవడంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించి కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూర్చే విధంగా ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తుందన్నారు. అందులో భాగంగానే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పోస్కో కంపెనీకి దారదత్తం చేయాలని కుట్రపన్ను తుందన్నారు. ఇప్పటికే బిఎస్ఎన్ఎల్‌లో విఆర్ఎస్ పేరుతో 80వేల మందిని ఇంటికి పంపిందని, బ్యాంకుల్లో ఒక్క ఎస్‌బిఐ లోనే 30వేల మందిని ఉద్యోగాల నుంచి తొలగించడానికి రంగం సిద్ధం చేసిందన్నారు. అసంఘటితరంగ కార్మికులకు కనీస వేతనాలు సవరించకుండా తాత్సారం చేస్తుందన్నారు. మోడీ విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం, రైతాంగం, ప్రజానీకం పెద్దఎత్తున పోరాడాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు ఆదినారాయణ, ఐఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు నాగభూషణం, ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, హెచ్ఎంఎస్ నాయకులు డి.అప్పారావు, ఎఐఎఫ్‌టియు నాయకులు గణేష్‌పాండ, ఎఐసిటియు నాయకులు శంకరరావు తదితరులు కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ నిరసన ప్రదర్శనలో సిఐటియు నగర, అధ్యక్ష కార్యదర్శులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, ఎం.జగ్గునాయుడు, బి.జగన్, బి.వెంకటరావు, పి.మణి, జి.అప్పలరాజు, పి.వెంకటరెడ్డి, ఎం.సుబ్బారావు, ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పడాల రమణ, మసేన్, మన్మదరావు, రెహ్మాన్, ఐఎన్‌టియుసి నాయకులు ఎన్.రామ చంద్రరావు, ఐఎఫ్‌టియు నాయకులు పాపినాయుడు, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## వార్డు సచివాలయాల ద్వారా పౌర సేవలు అందించాలి

**- జీవియంసి. కమిషనర్ డా.జి.సృజన**



విశాఖపట్నం : జివిఎంసి పరిధిలో ఉన్న వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు అవసరమైన సేవలు అందించాలని జి.వి.ఎం.సి. కమిషనర్ డా. జి. సృజన ఆదేశించారు. బుధవారం ఆమె జి.వి.ఎం.సి. ప్రధాన కార్యాలయంలో జోనల్ కమిషనర్లు, వార్డు స్థాయి, జోనల్ స్థాయి ప్రత్యేక అధికారులు, వార్డు కార్యదర్శులతో వీడియో కాన్ఫెరెన్స్ నిర్వహించారు. వార్డు కార్యదర్శులు నిరంతరం సచివాలయాలలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. జోనల్ కమిషనర్లు ప్రతీరోజూ ఒక సచివాలయాన్ని సందర్శించి తనిఖీ చేసి నివేదికను పంపాలన్నారు. ప్రతీ సచివాలయములలో కార్యదర్శులు, వాలంటీర్ల హాజరు పట్టికను, రోజువారి కార్యకలాపాలను తెలిపిన డైరీను పరిశీలించి తెలుసుకోవాలన్నారు. వీరితో పాటు ప్రత్యేక అధికారులు కూడా సచివాలయాలు సందర్శించి తనిఖీ చేయాలన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలైన ప్రధానమంత్రి స్వానిధి, వై.ఎస్.ఆర్. ఆసరా, జగనన్న తోడు, వై.ఎస్.ఆర్. చేయూత, విద్యా దీవన వంటి కార్యక్రమాల అమలు తీరును తెలుసుకోవాలన్నారు. ఇప్పటివరకు, జి.వి.ఎం.సి. ప్రధాన కార్యాలయాల్లో, జోనల్ స్థాయిలో ప్రజల నుండి విజ్ఞప్తులు, ఫిర్యాదులు స్వీకరిస్తున్నామని, ఇకపై వాటిని ఆయా సచివాలయాల పరిధిలోనే తీసుకోవాలన్నారు. ప్రజల విన్నపాలు, సేవలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించి వాటిని త్వరితగతిన పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ పోర్టల్ లో అప్లోడ్ చేయాలన్నారు. ఈ అంశంపై వార్డు స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడానికి జోనల్ కమిషనర్లు, జోనల్ స్థాయి అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వాటి పురోగతిపై ఎప్పటికప్పుడు కమిషనర్ కు నివేదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమీషనర్లు, జి.వి.ఎం.సి. విభాగాధిపతులు, జోనల్ స్థాయి ప్రత్యేకాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో చేరిన ఢిల్లీ డిప్యూటీ సీఎం

ఢిల్లీ : కరోనాతో భాదపడుతూ ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా ఆసుపత్రిలో చేరారు. ఈనెల 14న మనీశ్ సిసోడియాకు కరోనా నిర్ధారణ అయిన సంగతి తెలిసిందే. అయితే అప్పటినుంచే ఇంట్లోనే ఐసోలేషన్‌లో ఉన్న ఆయన స్వల్ప అస్వస్థతతో ఆసుపత్రిలో చేరారు. ఇప్పటికే పలువురు ప్రముఖులు కరోనా బారినపడి కోలుకున్న సంగతి తెలిసిందే. ఇక రాజధానిలో పాజిటివ్ కేసుల సంఖ్య 2 లక్షల 53 వేలు దాటాయి. గడిచిన 24 గంటల్లో 3,816 కొత్త కేసులు నమోదయ్యాయి.

దీంతో ఇప్పటి వరకు నమోదైన కరోనా కేసుల సంఖ్య 2,53,075కు చేరిందని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ హెల్త్ బులెటిన్‌లో వెల్లడించింది.

# డైనమిక్ సీఎం జగన్ సారధ్యంలో పనిచేస్తా

**విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్**



విశాఖపట్నం : 14 నెలలు మనసు చంపుకొని తెలుగుదేశంపార్టీ తరుపున కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. డైనమిక్ సీఎం ఆంధ్ర రాష్ట్రాన్ని ఏలుతున్న తరుణంలో ఆ పార్టీలో చేరడమే కరెక్ట్ అని వైఎస్సార్సీపీ పార్టీలో చేరనున్నారు. ఈ మేరకు బుధవారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో సముద్రమంత మార్పు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో కనిపిస్తోందని విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ అన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు జరగలేని పనులు వైఎస్ జగన్ పాలనలో జరుగుతున్నాయి. క్షేత్రస్థాయి వరకు సంక్షేమ కార్యక్రమాలు అందుతున్నాయి. 14 నెలల్లో 59 వేల కోట్లు ప్రజాసంక్షేమానికి ఖర్చు చేసిన ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేదు.

14 నెలలు మనసు చంపుకొని టీడీపీలో పని చేశాను. ప్రతిపక్ష పార్టీ నిర్మాణాత్మక సూచన చేయాలి, కానీ అది జరగడం లేదు. రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రతిపక్ష పార్టీకి పని లేకుండా చేశారు. ప్రతిపక్ష పార్టీగా పేదవాడి నోట్లో మట్టి కొట్టొద్దు. నాకు పార్టీలో ఏ పని అప్పగించిన బాధ్యతతో పని చేస్తా. సౌత్ నియోజకవర్గ పనుల కోసం బంట్రోతులా తిరిగిన టీడీపీ హయాంలో పనులు జరగలేదు. సూటు బూటు వేసుకున్న వారికే టీడీపీ ప్రభుత్వంలో పనులు జరిగాయి. అభివృద్ధికి వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ సూచన చేసింది. పేదల కోసం ఉద్యమాలు చేయమని టీడీపీ చెప్పలేదు. కోర్టులకు వెళ్లి పేదల ఇళ్ల స్థలాలు అడ్డుకున్నారు. రాబోయే రోజుల్లో టీడీపీకి మనుగడ లేదు.

20 లేదా 30 ఏళ్లు సీఎంగా జగన్‌మోహన్ రెడ్డి ఉంటారు. మనుసు చంపుకొని పార్టీ ఆదేశాల మేరకు సీఎంపై విమర్శలు చేశాను. మనసు చంపుకొని టీడీపీలో ఉండలేకపోయాను. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడానికి నేను సిద్ధం. నాపై అనర్హత ఫిర్యాదు చేసుకోమనండి. రాష్ట్రానికి, పేద ప్రజలకు సీఎం జగన్ ఒక లైఫ్ ఇచ్చారు. అమ్మఒడి, రైతు భరోసా వంటి కార్యక్రమాలు అమలు చేశారు. విశాఖపట్నంలో లేని ఉద్యమాలు చేయమంటే ఎలా చేస్తాను. రాజ్యాంగం మీద సీఎం జగన్ ప్రమాణం చేసినప్పుడే కులాలు, మతాలకు సంబంధం లేదని చెప్పారు. మళ్ళీ ఇప్పుడు డిక్లరేషన్ అనడం కరెక్ట్ కాదు. పరిపాల రాజధాని ప్రకటించిన రోజే నేను స్వాగతించాను. కొంతమంది రాక్షసుల్లా పరిపాలన రాజధాన్ని అడ్డుకుంటున్నారు.

వైజాగ్ కు పరిపాలన రాజధాని అయ్యే అర్హత లేదా. నా పేరు మీద అమరావతికి మద్దతుగా నాకు తెలియకుండా లేఖ విడుదల చేశారు. నేను పార్టీ ద్రోహిని అయితే చంద్రబాబు 'పేదల ద్రోహి' అంటూ విశాక సౌత్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్.. చంద్రబాబుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.



రాష్ట్రంలో సీఎం జగన్ నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వైకాపాకు మద్దతు తెలియజేస్తున్నాము. విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కు శుభాకాంక్షలు తెలియజేస్తూ తమ మద్దతును అందిస్తున్న నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వార్డు అధ్యక్షులు, కార్పొరేషన్ అభ్యర్థులు, కార్పొరేటర్ అభ్యర్థులు కార్పొరేటర్, పలు అనుబంధ సంఘాల ప్రతినిధులు

# నిర్మాణ పనులకు సిమెంట్ సరఫరా కీలకం

**జాయింట్ కలెక్టర్ అరుణ్‌బాబు**



విశాఖపట్నం : ప్రభుత్వ అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేసేందుకు సిమెంట్ సకాలంలో అందించడమే కీలకమని జాయింట్ కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, సిమెంట్ కంపెనీ ప్రతినిధులతో ఈ విషయమై ఆయన సమీక్ష నిర్వహించారు.

ప్రస్తుతం కోవిడ్ పరిస్థితులు కుదుట పడ్డాయని, రవాణా కు ఎటువంటి ఆటంకాలు లేనందున సిమెంటును సకాలంలో అందజేయాలన్నారు. సిమెంట్ కంపెనీలు ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఆయా కార్యక్రమాలకు, ప్రాజెక్టులకు అవసరమైన ఇసుకను నిర్మాణం జరిగే చోటికి చేరవేయ వలసిన బాధ్యత కంపెనీలకు ఉండదని స్పష్టం చేశారు. సిమెంట్ సరఫరా లేనట్లయితే పనులు సాగక నిర్మాణ కార్మికులకు, ప్రభుత్వ అధికారులకు ఎంతో సమయం వృధా అవుతుందన్నారు. ఆయా కంపెనీలతో చెల్లించవలసిన మొత్తాలను ఇప్పటికే చెల్లిస్తూ ఉన్నామని వీలైనంత వేగంగా పూర్తి చెల్లింపులు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాలైన అంగన్వాడీ కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాలు, గృహ నిర్మాణం, నీటి పారుదల పథకాలు, రోడ్ల నిర్మాణం మొదలైన వాటిని అన్నింటికీ పెద్ద ఎత్తున సిమెంటు అవసరం అవుతుందన్నారు. సిమెంట్ కంపెనీలు తమ బాధ్యతగా తమకు ఇచ్చిన ఆర్డర్ ప్రకారం సరఫరా చేసి అభివృద్ధి పథకాలకు పూర్తి సహకారం అందించాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా పరిషత్ పర్యవేక్షక ఇంజనీర్ సుధాకర్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ ఈ రవికుమార్ గృహ నిర్మాణ శాఖ పథక సంచాలకులు జయ రామాచారి, నీటిపారుదల శాఖ తదితర శాఖల ఇంజనీరింగ్ అధికారులు వివిధ సిమెంట్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పలు అనుమతులు, సర్టిఫికెట్ల వ్యాలిడిటీ పొడిగింపు

అమరావతి : రాష్ట్రంలో లేఅవుట్ ప్లాన్, బిల్డింగ్ ప్లాన్ అనుమతులు, కమెన్స్‌మెంట్ సర్టిఫికెట్ల కాల వ్యవధి ఏడాది పొడిగిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కరోనా నేపథ్యంలో ఏడాది పాటు వాటి వ్యాలిడిటిని పొడిగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు 2021 మార్చి 31 వరకు కాల వ్యవధిని పొడిగించింది.

కరోనా నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 25 తర్వాత ముగిసిన వాటికి ఇది వర్తించనుంది. ఇందుకోసం ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని, ప్రత్యేక అప్లికేషన్ కూడా అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# అక్టోబర్ 2 నుంచి 'మనం-మన పరిశుభ్రత' రెండో దశ..



అమరావతి : అక్టోబర్ 2 నుంచి రాష్ట్రంలో 'మనం-మన పరిశుభ్రత' రెండోదశ కార్యక్రమం ప్రారంభించబోతున్నట్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతి మండలానికి 5 నుంచి 10 గ్రామాలలో అమలవుతందని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రజాప్రతినిధులకు మంత్రి బుధవారం లేఖ రాశారు. జూన్ 1న మొదటిదశ మనం-మన పరిశుభ్రత ప్రోగ్రాం రాష్ట్రంలో ప్రారంభమైందని, జూలై 24 నుంచి 15 రోజుల పాటు పక్షోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా 1320 గ్రామ పంచాయతీల్లో తొలి దశ కార్యక్రమాలు జరిపినట్లు వెల్లడించారు. కోవిడ్-19 సమయంలో ఈ పక్షోత్సవాలు గ్రామాల్లో సత్ఫలితాలు ఇచ్చాయని మంత్రి తెలిపారు. ప్రజా భాగస్వామ్యంతో పల్లెల్లో ఆరోగ్యకర వాతావరణం నెలకొంటుందని, 70 శాతం సీజనల్ వ్యాధుల వ్యాప్తికి అడ్డుకట్ట వేయవచ్చని అన్నారు. ప్రజల నుంచి పంచాయతీలకు విరాళాలుగా రూ.1.72 కోట్లు జమ అయినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున రెండోదశ కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# కరోనా టీకా భారత్ బయోటెక్ కీలక ఒప్పందం

హైదరాబాద్: ప్రాణాంతక కరోనా వైరస్‌కు వ్యాక్సిన్‌ను తేచ్చే క్రమంలో హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఫార్మా దిగ్గజం భారత్ బయోటెక్ మరో కీలక ఒప్పందం కుదుర్చుకొంది. కొవిడ్-19 నివారణకు 'వాషింగ్టన్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్' అభివృద్ధి చేస్తున్న 'నాసల్ స్ప్రే వ్యాక్సిన్'(ముక్కు ద్వారా ఇచ్చే టీకా) తయారీకి ముందుకు వచ్చింది. దీన్ని చింపాంజీ అడినోవైరస్ ఆధారంగా తయారుచేస్తున్నారు. ఈ మేరకు వర్సిటీతో ఒప్పందం కుదుర్చుకొంది. దీంతో అమెరికా, జపాన్, ఐరోపా మినహా మిగిలిన ప్రపంచ దేశాల్లో ఈ టీకా పంపిణీకి సంబంధించిన అన్ని హక్కుల్ని భారత్ బయోటెక్ సొంతం చేసుకుంది.

ఈ టీకా తొలి దశ ప్రయోగాలు సెయింట్ లూయిస్ యూనివర్సిటీలో జరగనున్నాయి. తదుపరి క్లినికల్ ట్రయల్స్‌ను అన్ని రకాల అనుమతులు పొందిన తర్వాత భారత్ బయోటెక్ ఇండియాలో నిర్వహించనుంది. అనంతరం భారీ ఎత్తున దీన్ని ఉత్పత్తి చేయనుంది.

వ్యాక్సిన్ తయారీ, పంపిణీలో తమకున్న అనుభవం.. కరోనా వ్యాక్సిన్‌ను ప్రజల దగ్గరకు వేగంగా చేర్చడంలో ఉపయోగపడుతుందని సంస్థ ఛైర్మన్, ఎండీ డా.కృష్ణ ఎల్లా తెలిపారు. ఒక కోటి డోసుల ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సంప్రదాయ ఇంజెక్షన్ టీకాల కంటే నాసల్ స్ప్రే వ్యాక్సిన్లను అందించడం చాలా సులభమని తెలిపారు. సిరంజిలు, సూదుల వంటి వైద్య సామగ్రిని తగ్గిస్తుందన్నారు.

# హిందూ దేవాలయాల పై దాడులను అరికట్టాలి

**- మత ఘర్షణలకు మంత్రులు ప్రోత్సహిస్తున్నారు - టీడీపీ యువ నాయకుడు కార్తీక్ కుట్టా**



కంచరపాలెం: రాష్ట్రంలో జరుగుతున్న హిందూ దేవాలయాల పై దాడులను అరికట్టాలని గ్రేటర్ విశాఖ 54 వ వార్డులో టిడిపి యువ నాయకుడు కార్తీక్ కుట్టా ఆవేదన వ్యక్తం చేశారు. గ్రేటర్ విశాఖ 54 వ వార్డ్ లో కార్తీక్ కుట్ట ఆధ్వర్యంలో ఊర్వశి జంక్షన్ దగ్గర ఉన్న సుబ్రమణ్య స్వామి గుడి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్తీక్ కుట్టా మాట్లాడుతూ

సనాతన ధర్మానికి నిలయమైన భారతదేశం నేడు కొంతమంది స్వార్ధ రాజకీయ నేతల వికృత చేష్టలతో హైందవ ధర్మానికి ముప్పు వాటిల్లుతోంది.

ఆంధ్రప్రదేశ్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టక హిందూ వాదులపై, దేవాలయాలపై కొంతమంది క్షుద్రశక్తులు దాడులు చేస్తున్నారని కార్తీక్ (కుట్ట) ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రులు విచక్షణా రహితంగా మాట్లాడుతూ మత ఘర్షణలకు ప్రోత్సహిస్తున్నారని తెలియజేశారు.

ముఖ్యమంత్రి జగన్ రెడ్డి హిందూ దేవాలయల పై దాడులు ఆపాలి మరియు తిరుమల సాంప్రదాయల ప్రకారం డిక్లరేషన్ పై సంతకం పెట్టి తిరుమల సాంప్రదాయం ప్రకారం శ్రీవారిని దర్శించుకోవాలని కార్తీక్ కుట్ట డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో కృష్ణ , ఆదినారాయణ , పి.వి రమణ , పరుశురామ్ , రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏపీలో కరోనా 7,228 కొత్త కేసులు



అమరావతి : ఏపీలో కరోనా కేసులు తగ్గుముఖం పడుతున్నాయి. ఒక్కరోజు వ్యవధిలో 72,838 నమూనాలను పరీక్షించగా 7,228 మందికి కొవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయింది. దీంతో రాష్ట్రంలో కరోనా కేసుల సంఖ్య 6,46,530కి చేరింది. ఈ మేరకు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ బులెటిన్ విడుదల చేసింది. 24 గంటల వ్యవధిలో 45 మంది కరోనాకు చికిత్స పొందుతూ మృతిచెందారు. చిత్తూరు జిల్లాలో 7 మంది, ప్రకాశం 7, కృష్ణా 5, తూర్పుగోదావరి 4, విశాఖపట్నం 4, పశ్చిమగోదావరి 4, అనంతపురం 3, కడప 3, నెల్లూరు 3, గుంటూరు 2, కర్నూలు 2, శ్రీకాకుళం జిల్లాలో ఒకరు మరణించారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటి వరకు కొవిడ్‌తో మృతిచెందిన వారి సంఖ్య 5,506కి చేరింది. 24 గంటల వ్యవధిలో 8,291 మంది కరోనా నుంచి పూర్తిగా కోలుకున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 70,357 యాక్టివ్ కేసులు ఉండగా.. ఇప్పటి వరకు 5,70,667 మంది కోలుకున్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 53,02,367 నమూనాలను పరీక్షించినట్లు వైద్యఆరోగ్యశాఖ వెల్లడించింది.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com